

కొత్త ఏడాదిలోనైనా తీరేనా?

- జిల్లాను వెంటాడుతున్న సమస్యలు - పరిష్కారం వైపు ప్రజల ఆశలు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కర్నూలు జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులకు అడుగులు ఇటుకంతైనా పడటం లేదు. దీంతో కరవు, వలసలు ఆగడం లేదు. దానికి తోడు జిల్లాలో సమస్యలు కూడా తీవ్ర స్థాయిలో ఉన్నాయి. పాత ఏడాది గతించి కొత్త ఏడాదిలోకి అడుగుపెట్టిన నేపథ్యంలో ఈ కొత్త ఏడాదిలోనైనా పాలకులు జిల్లాలోని సమస్యల వైపు చూస్తారేమో అని జిల్లా వాసులు ఆశతో ఎదురుచూస్తున్నారు..

వలస నివారణ చర్యలు శూన్యం

ఏళ్లు గడుస్తున్నా జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో వలస వెతలు తప్పడం లేదు. ఉన్న ఊర్లో ఉపాధి లేకపోవడంతో పొట్ట చేతపట్టుకుని ఇతర పట్టణాలకు, నగరాలకు తరలిపోతున్నారు. కోసిగి, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, హోళగుంద, ఆలూరు, కోడుమూరు మండలాల నుంచి ఈ ఏడాది కూడా వలసలు ప్రారంభమయ్యాయి. తెలంగాణ, బెంగళూరు, గుంటూరు, ముంబైలకు తరలివెళ్లారు. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 2 లక్షల మందికి పైగా వలస వెళ్లారు. వలస నివారణకు చర్యలు చేపట్టే అంశాన్ని ఇప్పటి వరకూ ఏ బడ్జెట్‌లో ప్రస్తావించలేదు.

ఉత్తిపోతలుగానే వేదవతి ఎత్తిపోతలు

కరవుకు నిలయమైన ఆలూరు ప్రాంతంలో పొలాలు పచ్చబడాలన్న ఉద్దేశంతో వేదవతి నది పరిధిలో నిర్మించిన ఎత్తిపోతలు ఉత్తిపోతలుగా మారాయి. వేదవతి నది పరిధిలో అమృతాపురం, జె.హొసళ్లి , సిద్ధాపురం వద్ద మూడు ఎత్తిపోతల పథకాలు నిర్మించారు. 2008 లో మంత్రి మారెప్ప హయాంలో వీటిని చేపట్టారు. నిర్వహణలో లోపాలు అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంతో పథకాలు ఏడాదికే నిరుపయోగంగా మారాయి. పథకం ప్రారంభంలో వేసిన గొట్టాలు దెబ్బతిన్నాయి. ఒక్కో ఎత్తిపోతల కింద 500 నుంచి 600 ఎకరాల ఆయకట్టు ఉంది. మరమ్మతులకు నిధులు వెచ్చించి పునరుద్ధరిస్తే తామే వాటిని కొనసాగించుకుంటామని రైతులు వేడుకుంటున్నా పట్టించుకొనేవారు కరువయ్యారు.

గతి లేని గుండ్రేవుల

కర్నూలు, కడప జిల్లాలకు మేలు కలిగేలే రూపొందించిన గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించిన చర్యలేవీ ఇప్పటి వరకూ మొదలు కాలేదు. కర్నూలు జిల్లా సుంకేసుల దగ్గర తుంగభద్ర నదిపై 1.20 టిఎంసిల సామర్థ్యంతో 1865లో అప్పటి పాలకులు సుంకేసుల జలాశయాన్ని నిర్మించారు. ఈ బ్యారేజీకి అనుసంధానంగా కర్నూలు-కడప (కెసి) కాలువ నిర్మించారు. జల రవాణా కోసం నిర్మించిన కాలువను స్వాతంత్ర్యం అనంతరం సాగునీటి కాలువగా మార్చారు. కృష్ణా వాటర్ డిస్ప్యూట్ ట్రిబ్యూనల్ 31.90 టిఎంసిల నీటి వాటాను కేటాయించింది. దీని పరిధిలో కర్నూలు, కడప జిల్లాలో 2.65 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. సుంకేసుల సామర్థ్యం తక్కువ కావడంతో తుంగభద్రకు వరదవస్తేనే కాలువకు సాగునీరు అందుతోంది. ఈ సమస్యను అధిగమించేందుకు సాగునీటి నిపుణులు, విశ్రాంత ఇంజనీర్ సుబ్బరాయుడు సుంకేసుల రిజర్వాయర్ ఎగువన గుండ్రేవుల జలాశయం నిర్మాణానికి రూపకల్పన చేశారు. కర్నూలు జిల్లాలోని సి.బెళగల్, నందవరం, తెలంగాణలోని రాజోలి ప్రాంతాల్లో ఈ ప్రాజెక్టును నిర్మించేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. గుండ్రేవుల జలాశయం నిర్మాణం జరిగితే 20 టిఎంసిలు నిల్వ చేయనున్నారు. వరద లేని సమయంలోనూ ఈ నీటిని వాడుకోవచ్చు. గుండ్రేవులకు సంబంధించి గత ప్రభుత్వం లాగే ఈ ప్రభుత్వం కూడా శ్రద్ధ పెట్టడం లేదు. వైసిపి ప్రభుత్వం వచ్చాకా ప్రవేశపెట్టిన రెండు బడ్జెట్‌లలోనూ గుండ్రేవులకు నిధులు కేటాయించకపోవడంతో జిల్లా ప్రజల ఆశలు అడిఆశలయ్యాయి.

వసతులు లేని కొత్త డివిజన్...

జిల్లా విభజన తరువాత పత్తికొండ రెవెన్యూ డివిజన్ కొత్తగా ఏర్పడింది. ఈ ప్రాంతంలోని రెవెన్యూ పరమైన సమస్యలన్నీ పరిష్కారం అవుతాయని ఈ ప్రాంత రైతులు, ప్రజలు ఎన్నో కలలుగన్నారు. డివిజన్ ఏర్పాటై ఏడాది పూర్తయింది. నేటికీ సమస్యలు పరిష్కారం కాలేదు. ఆర్‌డిఒ కార్యాలయానికి సొంత భవనం నిర్మించేందుకు అవసరమైన నిధులు కూడా సమకూరలేదు. తహశీల్దారు కార్యాలయంలోనే రెవెన్యూ డివిజన్ కార్యాలయం ఏర్పాటు చేసి అక్కడి తహశీల్దారు కార్యాలయాన్ని వందేళ్ల నాటి పాత భవనంలోకి మార్చారు. 2022 ఏప్రిల్ 4న ఆదోని డివిజన్ నుంచి విడిపోయి కొత్తగా ఏర్పాటైన పత్తికొండ డివిజన్లో పత్తికొండ నియోజకవర్గంలోని నాలుగు, ఆలూరు నియోజకవర్గంలోని ఐదు మండలాలతో కలిసి కొత్తగా పత్తికొండ డివిజన్ ఏర్పడింది.

కర్నూలుకు రాని హైకోర్టు : వైసిపి ప్రభుత్వం రాష్ట్ర హైకోర్టును కర్నూలులో ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. దీనికి ఇప్పటి వరకూ ఇటుక కూడా పేర్చలేదు. కర్నూలు నగర శివారులోని జగన్నాథగట్టు వద్ద 200 ఎకరాలు హైకోర్టు కోసం కేటాయించారు. అయినా ఇప్పటి వరకూ శంకుస్థాపనకు నోచలేదు. న్యాయరాజధాని వస్తే కర్నూలు కొంతైనా అభివృద్ధి చెందుతుందని జిల్లా వాసులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

రైలు రద్దుతో తిప్పలు : జిల్లా కేంద్రం నుంచి నడిచే రైలు రద్దుతో జిల్లా వాసులకు తిప్పలు తప్పడం లేదు. కర్నూలు నుంచి విజయవాడ వెళ్లేందుకు గతంలో ఉన్న రైలు వారానికి మూడు రోజులు నడిచేది. దాన్ని మంత్రాలయం వరకూ పొడిగించారు. చివరికి రైలును రద్దు చేశారు. దీంతో రాష్ట్ర రాజధానికి కర్నూలు జిల్లా కేంద్రం నుంచి వెళ్లాలంటే తిప్పలు తప్పడం లేదు.

వెంటాడిన పత్తి విత్తనాలు : కర్నూలు జిల్లా ప్రజలను కల్తీ పత్తి విత్తనాలు వెంటాడుతూనే ఉన్నాయి. ప్రతి ఏటా లాగా ఈ ఏడాది కూడా కల్తీ పత్తి విత్తనాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారు. కల్తీ పత్తి విత్తనాలను అధికారులు ఈ ఏడాదైనా అరికట్టాల్సిన అవసరం ఉంది.

ప్రాణాంతకంకాని కోవిడ్ జెఎన్1

- జిల్లాలో కేసులు నమోదు
- భయాందోళన చెందాల్సిన అవసరం లేదు
- ముందు జాగ్రత్తలు తీసుకుంటే సరి
- జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకట రంగారెడ్డి



ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

దేశవ్యాప్తంగా మరోసారి కరోనా కలకలం రేపుతోంది. కొత్త వైరస్ పేరు జెఎన్-1గా గుర్తించారు. కర్నూలు జిల్లాలో మొదటిసారిగా కొత్త వైరస్ ముగ్గురికి సోకినట్టుగా కరోనా టెస్టులు నిర్వహించిన వైద్యులు తెలిపారు. కరోనా వైరస్ ఎలా వ్యాప్తి చెందుతుంది ఎలా నియంత్రించుకోవాలి ఎలా నివారించుకోవాలి అనే అంశాలపై కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకట రంగారెడ్డితో ప్రజాశక్తి ముఖాముఖి...

కరోనా కొత్త వైరస్ ఎలా వ్యాప్తి చెందుతుంది?

సూపరింటెండెంట్ : కరోనా కొత్త వేరియంట్ పేరు జెఎన్1గా గుర్తించారు. ప్రపంచంలో సింగపూర్, అమెరికా, యూరోప్ దేశాలలో కనుగొనబడింది. మన దేశంలో కేరళ రాష్ట్రంలో మొదటగా కనుగొన్నారు. ఆ తర్వాత తెలంగాణ ఆంధ్ర రాష్ట్రాలలో వైరస్ ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ వైరస్ పలు రాష్ట్రాలలో వేగంగా విస్తరిస్తోంది. దేశవ్యాప్తంగా యాక్టివ్ కేసులు నాలుగు వేలు ప్రతిరోజు వస్తున్నాయని తెలుస్తోంది. మన జిల్లాలో మొదటిసారిగా 84 మంది నుంచి శాంపిల్స్ సేకరించి టెస్టులు నిర్వహించగా ముగ్గురికి పాసిటివ్ లక్షణాలు వచ్చాయి. ఒకరి నుంచి ఒకరికి తుమ్మినా దగ్గినా ఈ వైరస్ సోకుతుంది.

ఈ వైరస్ లక్షణాలు ఏవి?

సూపరింటెండెంట్ : ఈ వైరస్ సోకిన వారిలో జలుబు, తుమ్ములు, దగ్గు, గొంతునొప్పి, ఒళ్ల నొప్పులు, కడుపులో మంట, కీళ్ల నొప్పులు ఉంటాయి.

ఈ వైరసుకు ఎలాంటి చికిత్స తీసుకోవాలి?

సూపరింటెండెంట్ : ఈ వైరస్ సోకిన వారిని ప్రత్యేక గదిలో ఉంచాలి. జన సమూహాల మధ్య తిరగకూడదు. మూడు రోజులపాటు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటే జాగ్రత్తలు పాటిస్తే తగ్గిపోతుంది. ఈ వైరస్ ప్రాణాంతకమైనది కాదు.

ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

సూపరింటెండెంట్ : వైరస్ సోకిన వారి నుంచి దూరంగా ఉండాలి. ప్రజలు రద్దీగా ఉన్న ప్రాంతాల్లో మాస్కులు ధరించాలి. వ్యక్తిగత ఐసోలేషన్ ఉంచుకోవాలి.

ప్రభుత్వాసుపత్రిలో వైరస్ బాధితులకు ఎలాంటి చికిత్సలు అందించనున్నారు?

సూపరింటెండెంట్ : కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల కోవిడ్ జెఎన్1 కోవిడ్ పరీక్షా కేంద్రాలు మూడింటిని ఏర్పాటు చేశాం. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఎఫ్ఎంసి-కోవిడ్ జెఎన్1 విభాగం పీడియాట్రిక్, మెడికల్ విభాగం ఓపీ 9 విభాగాలలో కోవిడ్ పరీక్షా కేంద్రాలను ప్రారంభించాము. ఆసుపత్రిలోని ఎఫ్ఎంసీ-కోవిడ్ జెఎన్1 విభాగంలో 45 పడకల విభాగాన్ని సిద్ధం చేశాం. అందులో వెంటిలేటర్స్ మరియు ఆక్సిజన్ ఫోర్స్ సిద్ధం చేశాము. కోవిడ్ అనుమానితులకు ఆర్‌టిపిసిఆర్ టెస్టులు చేయించడం, పేషెంట్స్ ఎవరికైనా పాజిటివ్ వస్తే వారికి హోమ్ ఐసోలేషన్, వార్డులో కేసులు అడ్మిట్ చేయడానికి బెడ్స్ సిద్ధం చేశాము. కోవిడ్ కేసుల నుంచి ఎటువంటి భయాందోళన పడాల్సిన అవసరం లేదు. ఎవరికైనా సింప్టమాటిక్ చేంజెస్ ఉంటే వాళ్లకు హోమ్ ఐసోలేషన్, మిగతా ఎవరికైనా క్రిటికల్ గా ఉన్నవాళ్లకి అడ్మిషన్ చేసి వాళ్ళకి ట్రీట్మెంట్ అందిస్తాము.



అంగన్‌వాడీలను వేదిస్తే తిరగబడతారు : సిఐటియు

20వ రోజు కొనసాగిన అంగన్వాడీల సమ్మె

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

కర్నూలులో అంగన్వాడీల సమ్మె 20వ రోజుకు చేరింది. అంగన్వాడీలు రోజురోజుకు రెట్టింపు ఉత్సాహంతో సమ్మెలో పాల్గొంటున్నారు. ధర్నా చౌక్‌లో దీక్షలకు వివిధ ప్రజా సంఘాలు ఉద్యోగ సంఘాల మద్దతుతో అంగన్వాడీలకు రెట్టింపు ఉత్సాహం వస్తుందన్నారు. ప్రభుత్వం పట్టుదలకు పోకుండా చిరుద్యోగులపై బ్రహ్మాస్త్రం ప్రయోగించవద్దని సమ్మె జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆదివారం సమ్మె శిబిరానికి ఆవాజ్ నగర కమిటీ కార్యదర్శి ఎస్ఎండి షరీఫ్ ఆధ్వర్యంలో ప్రదర్శనగా వచ్చి అంగన్వాడీల మద్దతు తెలిపారు. అంగన్వాడీలు న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆవాజ్ నాయకులు నయీమ్, చోటుభాయ్, తదితరులు పాల్గొన్నారు. ఎస్‌టియు రాష్ట్ర కార్యదర్శి తిమ్మన్న, గోకారి, బాలయ్య, ఎస్.నారాయణ స్వామి, సురేష్ శేఖర్ బృందంగా వచ్చి అంగన్వాడీలను ఉద్దేశించి మాట్లాడుతూ మిలిటెంట్ ఉద్యమాలు ఎంతటి నియంతృత్వ ప్రభుత్వాల నైనా మట్టి కరిపిస్తాయని హెచ్చరించారు. కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎండి. ఆనంద్‌బాబు, కాటికాపర్ల సంఘం కార్యదర్శి కృష్ణ వారి బృందంతో మద్దతు తెలిపారు. ఎఐటియుసి సీనియర్ నాయకులు మనోహర్ మాణిక్యం, దీక్షకు మద్దతుగా ప్రసంగించారు. ఈరోజు సమ్మె శిబిరంలో 20 మంది అంగన్వాడీలు రిలే దీక్షలో పాల్గొన్నారు. ఈ దీక్షలలో అంగన్వాడీ జిల్లా అధ్యక్షురాలు రేణుక, పుష్ప, విజయలక్ష్మి, సుమలత, స్వామి, దేవి , శ్రావణి ఆయాలు చాంద్ భీ, హైమావతి, మీనాక్షి, పరమేశ్వరి, పాల్గొన్నారు. ఈ సమ్మెకు సిఐటియు జిల్లా నాయకులు ఎం. గోపాల్, ఎఐటియుసి నగర కార్యదర్శి ఎం. చంద్రశేఖర్, నల్లన్న, సిఐటియు నగర కార్యదర్శి సిహెచ్.సాయి బాబా, ఉపాధ్యక్షులు కె. సుధాకరప్ప, ఎస్. మహమ్మద్ రఫీ, కె.ప్రభాకర్, విజయ్, రామకృష్ణ, తదితరులు నాయకత్వం వహించారు. చివరగా అంగన్వాడీలు ఆట పాటలతో నిరసన వ్యక్తం చేశారు.



ధర్నా చౌక్‌లో మాట్లాడుతున్న పిఎస్ రాధాకృష్ణ



మాట్లాడుతున్న గౌస్ దేశాయ్

అంగన్‌వాడీల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవాలి: సిపిఎం

పత్తికొండ: అంగన్‌వాడీల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకుని వెంటనే పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయి డిమాండ్ చేశారు. సిఎం జగన్మోహన్ రెడ్డికి అంగన్వాడీల సమస్యలు పట్టవా అని ప్రశ్నించారు. ఆదివారం పత్తికొండ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ ఆధ్వర్యంలో 20వ రోజు సిఐటియు మండల కార్యదర్శి డి గోపాల్ అధ్యక్షతన దీక్షలు చేపట్టారు. గౌస్‌దేశాయి మాట్లాడుతూ అంగన్‌వాడీల సమ్యలు పరిష్కార మయ్యేంత వరకు అండగా ఉంటామని అన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రూ.26 వేల జీతం, నెలకు ఇవ్వాలని అలాగే ఐదు లక్షలు ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని ఉద్యోగ భద్రత కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షుడు న్యాయవాది జి. కాశీ విశ్వనాథ్, సిఐటియు, మద్దికేర మండల కార్యదర్శి డి.రాముడు, అంగన్వాడి, వర్కర్స్ యూనియన్ నాయకురాలు కాంతమ్మ, పద్మజ ,షాజహాన్, స్వర్ణలత, జ్యోతి, సుంకులమ్మ, బి.జ్యోతి తదితర అంగన్వాడీ కార్యకర్తలు అండ్ హెల్పర్స్ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పట్టని ముఖ్యమంత్రి

గూడూరులో ఒంటికాలిపై నిలబడి నిరసన

ప్రజాశక్తి-గూడూరు

మున్సిపల్ కార్మికుల సమస్యలను ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పట్టించుకో వడం లేదని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి. అంజిబాబు విమర్శించారు. మున్సిపల్ కార్మికుల ఉద్యోగాల పర్మినెంట్, సమాన పనికి సమాన వేతనం కోసం మున్సిపల్ కార్మికులు గూడూరులో చేపట్టిన సమ్మె ఆదివారంతో ఆరవ రోజుకు చేరింది. గూడూరు పాత బస్టాండ్ లో సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు ఏర్పాటుచేసిన సమ్మె శిబిరంలో మున్సిపల్ కార్మికులు ఒంటి కాలిపై నిలబడి రాష్ట్ర ప్రభుత్వానికి వినూత్నంగా నిరసన తెలిపారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజి బాబు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వానికి అనేక దఫాలుగా విన్నవించుకున్నా పట్టించుకోకపోవడం దుర్మార్గమని అన్నారు. గత్యంతరం లేక సమ్మె చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కమిషనర్లతో, అధికారులతో బయటి వ్యక్తులను పిలిచి పనులు చేయించడానికి చూడడం రాష్ట్ర ప్రభుత్వానికి సిగ్గుచేటన్నారు. బయట వ్యక్తులతో పనులు చేయించడంలో మున్సిపల్ కమిషనర్,, మున్సిపల్ అధికారులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని, అధికారుల అత్యుత్సాహము కరోనాకాలంలో ఎక్కడికి పోయిందని ప్రశ్నించారు. కరోనాకాలంలో అధికారులు ప్రజాప్రతినిధులు కరోనాకు భయపడి ఇండ్లలో దుప్పటి కప్పుకొని ఉంటే మున్సిపల్ కార్మికులు ఆరోజు తమ ప్రాణాలకు తెగించి పనిచేశారని గుర్తు చేశారు. బయట వ్యక్తుల పనులు అడ్డుకుంటే విధుల నుంచి తొలగిస్తామని అధికారులు భయపెడుతున్నారని, కార్మికులను భయపెడితే భయపడరని, రాష్ట్ర ప్రభుత్వానికి కార్మికులపై చిత్తశుద్ధి ఉంటే ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని, లేనిచో ఉద్యమాలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు డివిజన్ కార్యదర్శి జె.మోహన్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు శాంతన్న, దానమన్న, మనోహరమ్మ, గ్రేస్ అమ్మ, లక్ష్మీదేవి, సూర్య శేఖర్, వెంకటేశ్వరమ్మ, గోపాల్, పాల్గొన్నారు.



ఒంటికాలిపై నిలబడి నిరసన చేస్తున్న కార్మికులు

క్రమశిక్షణకు క్రీడలను మించిన సాధనం లేదు

సిలంబం క్రీడాకారులను , రెఫరీలు, శిక్షకులను అభినందించిన డాక్టర్ శంకర్‌శర్మ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ విద్యార్థులు దురాలవాట్లకు దూరంగా క్రమశిక్షణ కలిగిన పౌరులుగా ఎదగాలంటే క్రీడలకు మించిన సాధనం లేదని సీనియర్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ శంకర శర్మ అన్నారు. కర్నూలు నగరంలోని ఎన్ఆర్ పేటలోని శ్రీలక్ష్మీ హైస్కూల్లో జరిగిన ఫిజికల్ ఫిట్నెస్‌లో అర్హత సాధించిన సిలంబం (కర్రసాము) క్రీడ రెఫరీలు, కోచ్‌ల అభినందన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డాక్టర్ శంకర్ శర్మ మాట్లాడుతూ పాఠశాల స్థాయిలోనే గంజాయి, మాదకద్రవ్యాలు వంటి అలవాట్లకు బానిసలు అవుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో అలాంటి అలవాట్లకు దూరంగా ఉత్తమ పౌరులుగా ఎదగాలంటే తల్లిదండ్రులు తమ పిల్లలను క్రీడల్లో ప్రోత్సహించాలని సూచించారు .క్రీడల్లో పాల్గొనడం వల్ల శారీరక మానసిక ఆరోగ్యం మెరుగుపడి చదువులోనూ రాణిస్తారని వివరించారు. మన దేశానికి సంబంధించిన ప్రాచీన క్రీడ సిలంబం (కర్ర సాము) ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందడం అభినందనీయమని తెలిపారు. సుప్రసిద్ధ హాలీవుడ్ నటుడు బ్రూస్‌లీ కూడా ఈ విద్యలో ఆరితేరిన నటుడని ఆయన చిత్రాలు చూస్తే ఈ క్రీడా గొప్పదనం తెలు స్తుందని వివరించారు. ప్రస్తుతం సిలంబం క్రీడకు సంబంధించి ఫిజికల్ ఫిట్నెస్‌లో అర్హత సాధించిన రెఫరీలు, కోచ్‌లు విద్యార్థులకు ఈ క్రీడలో చక్కని శిక్షణ ఇచ్చి వారిని ఉన్నత స్థాయికి తీసుకురావాలని సూచించారు. సిలంబం క్రీడ అభివద్ధికి తన వంతు సహకారం నిరంతరం అందిస్తానని చెప్పారు. సిలంబం కోచ్ రాఘవేంద్ర ,వైస్ ప్రెసిడెంట్ ఉదయ్ కుమార్, కార్యదర్శి మహావీర్‌తో పాటు షేక్ గౌస్ బాషా, సుబ్రహ్మణ్యం ,గీత, పూజ,రఘువీర్, సత్యనారాయణ ,అబ్దుల్ బహదూర్ ,శరణ్య, చరని పాల్గొన్నారు.



సిలంబం క్రీడాకారులు , కోచ్‌లను సన్మానిస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయి

టమోటా జ్యూస్ ఫ్యాక్టరీ హామీ ఏమైంది : సిపిఎం

ప్రజాశక్తి-పత్తికొండ

పత్తికొండలో సిఎం జగన్మోహన్ రెడ్డి టమోటా జ్యూస్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామని చెప్పిన మాటలు మాటలకే పరిమితమైందని సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ అన్నారు. ఆదివారం పత్తికొండలోని ఈశ్వర్ రెడ్డి భవనంలో రైతు సంఘం మండల కార్యదర్శి సిద్దయ్య గౌడ్ అధ్యక్షతన రైతు సంఘం జనరల్ బాడీ జనరల్ బాడీ సమావేశం ఏర్పాటు చేశారు. గౌస్ దేశాయ్ మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో అత్యంత వెనుకబడిన పశ్చిమ ప్రాంతమైన పత్తికొండను కరువు మండలంగా ప్రకటించాలని అనేక ఉద్యమాలు చేశామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర మద్దతు ధర కల్పించడంలో పూర్తిగా విఫలమైందని అన్నారు. రైతులకు రాయితీ పరికరాలను అందించాలని డిమాండ్ చేశారు. మండలంలోని రైతు సంఘం నాయకులు గ్రామ కమిటీలు ఏర్పాటు చేసి బలోపేతం చేయాలని అన్నారు. రైతుల కోసం అనేక పోరాటాలు చేయాలని భవిష్యత్ కార్యాచరణను రూపొందించారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి రంగారెడ్డి, దేవనకొండ మండలం కార్యదర్శి సూరి, చక్రాల నారాయణ, హోసూరు మస్తానీ, పందికోన రంగన్న, పెద్దహుల్తి బ్రహ్మయ్య, రాముడు, రమేష్ తదితర రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యా పరిరక్షణకు చలో ఢిల్లీ: ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ఎస్ఎఫ్ఐ 54వ ఆవిర్భావ దినోత్సవం కర్నూలు మండలం ఉల్చాల గ్రామంలో ఎస్ఎఫ్ఐ కర్నూలు మండల కార్యదర్శి అంజి అధ్యక్షతన నిర్వహించారు. మాజీ ఎస్ఎఫ్ఐ నాయకులు రాఘవేంద్ర జండా ఆవిష్కరణ చేశారు. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, మాజీ నాయకుడు రాఘవేంద్ర మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నూతన విద్యా విధానం అమలు చేసి పేద బడుగు బలహీన వర్గ విద్యార్థులకు చదువు దూరం చేస్తున్నారని అన్నారు. నూతన విద్యా విధానంలో ఎవరు డబ్బు పెట్టగలరో వాళ్లకే చదువు అందుతుందని అన్నారు. ఈ విధానం ద్వారా రాష్ట్రంలో దేశంలో విద్యార్థులు యువకులు నిరక్షరాస్యులు అయ్యి దేశం వెనుకబాటు తనానికి గురవుతుందని అన్నారు. అదేవిధంగా పాఠ్యపుస్తకాలలో మహానుభావుల చరిత్రను తీసేసి, బ్రిటిష్ వాళ్లకు కొమ్ముగాసిన వాళ్ల చరిత్రను చేరుస్తున్నారని అన్నారు. దాంతోపాటు పాఠ్యపుస్తకాలలో శాస్త్రీయ భావజాలాన్ని తీసేసి అశాస్త్రీయ భావజాలాలను చొప్పిస్తున్నారని అన్నారు. దాంతో మన దేశం అభివృద్ధి నిరోధకంగా మారుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు మహేశ్, రాజేశ్, రహీం, వేణు, వైఎఫ్ఐ నాయకులు కిషన్, ప్రకాష్, రాము, శ్రీను, మహేంద్ర,గోవిందు, మోహన్ శివ పాల్గొన్నారు.



21వ రోజు కొనసాగిన న్యాయవాదుల దీక్షలు

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్



న్యాయవాదుల దీక్షలు 21వ రోజు ధర్నా చౌక్‌లో ఎ. శ్రీనివాసులు ఆధ్వర్యంలో కొనసాగాయి. ఈ దీక్షలకు ప్రసూన లా కళాశాల విద్యార్థులు గోవిందు, చిన్న నాగన్న తేజేష్, వీరేశ్, పార్థసారథి రెడ్డి కూర్చున్నారు. ఈ దీక్షలకు అవాజ్ కమిటీ నాయకులు బాబుషరీఫ్, ఇస్మాయిల్, చోటబాయ్, బషీర్ సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో కరుణాకర్ రావు , రవి కుమార్, ఎస్.లక్ష్మణ్, షఫత్ అహ్మద్, మోహన్ రెడ్డి, గోరంట్ల, అంజి పాల్గొన్నారు

12 వ రోజు ఎస్ఎస్ఎ ఉద్యోగుల నిరవధిక సమ్మె

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్



కర్నూలు జిల్లా విద్యాశాఖ పరిధిలో పనిచేస్తున్న అన్ని మండలాల సమగ్ర శిక్ష ఉద్యోగులు వారి సమస్యల పరిష్కారం కోసం ధర్నా చౌక్‌లో చేస్తున్న సమ్మె 12వ రోజు కొనసాగింది. సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు జె. నాగేశ్వరరావు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.చంద్రశేఖర్ రాజు, కార్యదర్శులు రంగన్న , జిల్లా నాయకులు రఫీ, శంకర్ ,రమణ, వెంకట్ రాముడు, మధు మోహన్ , రమణ, సత్యమ్మ, కెజిబివి సంఘం నాయకులు పాల్గొనారు. ఎస్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిమ్మన్న మాట్లాడుతు మీ వెంట మేము ఉన్నామని సంఘీభావం తెలిపారు.

తల్లిదండ్రులను స్మరించుకోవడం గొప్పఅనుభూతి

పాపులమ్మ, బాలరంగయ్య పురస్కార సభలో వక్తలు



బుర్రకథ కళాకారులు విభూతి సోదరులకు పురస్కారం అందజేస్తున్న విసి సాయిగోపాల్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జన్మనిచ్చిన తల్లిదండ్రులను స్మరించుకోవడం గొప్ప అనుభూతి అని ప్రతి ఒక్కరు తల్లిదండ్రులను ప్రేమగా చూసుకోవాలని దండెబోయిన పాపులమ్మ, పాండురంగయ్య స్మారక పురస్కార సభలో వక్తలు తెలిపారు. ఆదివారం కెవిఆర్ కళాశాలలో డాక్టర్ దండెబోయిన పార్వతిదేవి తల్లితండ్రులు పాపులమ్మ, బాలరంగయ్య స్మారక పురస్కార ప్రదానోత్సవం సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వివి సుబ్రహ్మణ్య కుమార్ అధ్యక్షతన జానపద, సాహిత్య కళారూపాల, ఆట, ఆట కార్యక్రమాల సభ అత్యంతవైభవంగా నిర్వహించారు. క్లస్టర్ యూనివర్సిటీ విసి సాయిగోపాల్ మాట్లాడుతూ వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులకు తాను గోరుముద్దలు తినిపించిన వైనాన్ని గుర్తు చేసుకుంటూ, కళాశాలలో ఇలాంటి కార్యక్రమాలను ఏర్పాటు చేయడం వల్ల విద్యార్థులకు వ్యక్తిత్వవికాసానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రస్తుత పరిస్థితులలోని అవరోధాలను అధిగమించి విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. రవీంద్రవిద్యాసంస్థల అధినేత జి.పుల్లయ్య మాట్లాడుతూ ప్రస్తుతం వృద్ధాశ్రమాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులను బిడ్డలు పట్టించుకోకపోవడం వల్లనే పెరిగాయని అందులో కూడా వ్యాపార దృక్పదంపెరిగిందన్నారు. ఎంత సంపాధించామనేదానికంటే సమాజంలోని మనుషులమధ్య ఎంత ప్రేమాభిమానాలతో బతికామన్నదే ముఖ్యమన్నారు. బతికున్న తల్లిదండ్రులను విస్మరిస్తున్న తరుణంలో చనిపోయిన తల్లితండ్రడుల కోసం ఇలాంటి గొప్ప కార్యక్రమం నిర్వహించిన పార్వతిదేవి, లక్ష్మయ్య దంపతులను అభినందించారు. నందిఅవార్డు గ్రహీత పత్తిఓబులయ్య మాట్లాడుతూ పాపులమ్మ, పాండురంగయ్య కుటుంబంలో 25 మంది విద్యావంతులను తయారయ్యారంటే సామాన్య విషయం కాదన్నారు. తల్లి, స్త్రీ గొప్పతనాన్ని పద్యం పాడి వినిపించారు. కావెం సుబ్బలక్ష్మి మాట్లాడుతూ కెవిఆర్ కళాశాలతో ఉన్న చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. 'తెలుసుకోండిపల్లిల్లారా తెలుగుతల్లిపూజ ఇది ' అని పాటపాడి సభను ఉత్తేజపరిచారు. డాక్టర్ దండెబోయిన పార్వతి మాట్లాడుతూ ఆమె వారి తల్లిదండ్రులను స్మరించుకుంటూ, వారి తండ్రి బోధనావృత్తితోపాటు సేద్యం, వైద్యం చేస్తూనే సామాజిక సేవ చేసిన వైనాన్ని చెమర్చిన కళ్ళతో వివరించారు. వేదిక మీద ఉన్న పెద్దలందరూ తమ తమ తల్లిదండ్రులను జ్ఞప్తికి చేసుకోవడం అందరి మనసులనూ కదిలించింది. క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ శ్రీనివాసులు మాట్లా డుతూ ఆయన తల్లి కోసం గ్రీన్ కార్డును, డాలర్ల సంపాదనను ఇచ్చే పరాయి గడ్డను వదలి పురిటిగడ్డకు వచ్చిన వైనాన్ని వివరించారు. కెవిఆర్. కాలేజీ ప్రిన్సిపల్ సుబ్రహ్మణ్య కుమార్ మాట్లాడుతూ తల్లిదండ్రులను వృద్ధాశ్రమాలలో వదిలేస్తున్న రోజుల్లో ఇలా కన్నవారిని తలచుకుంటూ స్మారక పురస్కారాలు ఇవ్వడం ప్రశంసనీయమని కొనియాడారు. జెఎస్ఆర్‌కె శర్మపద్యాలు, రిటైర్డ్‌పోలీసు అధికారి అంకయ్య ఈలపాట, పోతన జానపద గీతం, బసవరాజు తెలుగు పాట, పార్వతిదేవి సోదరులు రమేష్ పాడిన తల్లిదండ్రుల పాట, మాంటిస్సోరి చిన్నారులు ప్రదర్శించిన స్వాగత నృత్యం, జానపద నృత్యం ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.

ఆకట్టుకున్న బుర్రకథ: ఈనాటి పురస్కార గ్రహీతలు రాజమహేంద్రవరానికి చెందిన విభూతి సోదరులు లోవరాజు, ప్రసాద్ , శ్రీనివాస రాజు ప్రదర్శించిన బుర్రకథ కళారూపం సభికులను ఆకట్టుకుంది. అల్లూరి సీతారామరాజు చరిత్ర ఆద్యంతం ప్రేక్షకులను అలరించింది. చివరగా చక్కటి జ్ఞాపికలతో అతిథులను, కళాకారులను సత్కరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న బివి జయనాగేశ్వర రెడ్డి

హామీల అమలులో సీఎం జగన్ విఫలం

- మాజీ ఎమ్మెల్యే బివి జయనాగేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విఫలమయ్యారని ఎమ్మిగనూరు నియోజకవర్గ మాజీ శాసన సభ్యులు, రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు డా. బివి జయనాగేశ్వర రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ అధికార వైసిపి పార్టీ అధినేత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను, నవరత్నాల పేరుతో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో 85 శాతం విఫలమయ్యారని ఆధారాలతో పుస్తక రూపంలో పత్రిక విలేకరుల సమక్షంలో బహిర్గతం చేయడం జరిగిందన్నారు. ఎన్నికల మేనిఫెస్టో బైబుల్, ఖురాన్, భగవద్గీత అని చెప్పిన జగన్ మోహన్ రెడ్డి అటు రాష్ట్ర స్థాయిలో, జిల్లా స్థాయిలో అదే విధంగా ఎమ్మిగనూరు నియోజకవర్గ స్థాయిలో ఇచ్చిన అమలు కానీ హామీలను ఇచ్చి అన్ని వర్గాల ప్రజలను మోసం చేసి గద్దెనెక్కారని పేర్కొన్నారు. అధికారులకు ఒక చోటు నుండి మరొక చోటికి ట్రాన్స్ఫర్‌అనేది సర్వసాధారణం కానీ ఇక్కడ జగన్మోహన్ రెడ్డి ఎమ్మెల్యేలకు, మంత్రులకు ఒక చోటు నుండి మరో చోటుకు ట్రాన్స్ఫర్ చేయడం రాజకీయ చరిత్రలో మొదటిసారి అని ఎద్దేవా చేశారు. ఒక ఇంటి ముందు చెత్త వేరొక ఇంటి ముందు వేస్తే అది బంగారం అవుతుందా అని ఎద్దేవా చేశారు. మార్చాల్సింది ఎమ్మెల్యే, మంత్రులను కాదని ప్రజలు వైసిపి ప్రభుత్వాన్ని మార్చడానికి సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. కేవలం 100 రోజుల్లో రాబోయే ఎన్నికల్లో వైసిపిని ఇంటికి పంపడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. అంతకుముందు ఎమ్మిగనూరు నియోజకవర్గ పరిధిలోని ప్రజలకు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ఎన్‌టిఆర్, బాలకృష్ణ అభిమానులు, పత్రికా విలేకరులు, అధికారులు, అనధికారులకు ప్రతి ఒక్కరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నేతలు

యుటిఎఫ్ డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఆదోని


ప్రభుత్వ విద్యా పరిరక్షణకు విద్యార్థుల సర్వతోముకాభివృద్ధికి అందరూ బాధ్యతగా కృషి చేయాలని ఆదోని మండల విద్యాధికారి-2 పి శ్రీనివాసులు సూచించారు. ఆదివారం ఆదోని పట్టణం మున్సిపల్ హై స్కూలులో 2024కు సంబంధించి యుటిఎఫ్ నూతన డైరీ, అధ్యాపక దర్శిని, కాలమానిని ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆదోని మండల విద్యాధికారి- 2 పి శ్రీనివాసులు, గవిగట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జిసి శేకన్న, బిలేహాళ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సలావుద్దీన్ ఆవిష్కరిం చారు. యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు బి జీవిత, జిల్లా కార్యదర్శి టీ గాది లింగప్ప మాట్లాడుతూ యుటిఎఫ్ ఉపాధ్యాయ సమస్యల పట్ల అలుపెరిగిన పోరాటం చేస్తూ, ఉపాధ్యాయ ఉద్యమంలో తిరుగులేని సంఘంగా ఉంటూ మరోవైపు విద్యారంగం పరిరక్షణకు అంతులేని పోరాటం చేస్తోందన్నారు. యుటిఎఫ్ రూపొందించిన డైరీ ఉపాధ్యాయులతోపాటు ఉద్యోగులందరికీ ఎంత ఉపయుక్తంగా ఉంటుందని, సెలవు నిబంధనలు, సర్వీస్ విషయాలతో పాటు ముఖ్యమైన ప్రభుత్వ ఉత్తర్వులు అన్నిటిని పొందపరిచారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ జి శ్రీనివాసులు, ఆడిట్ కమిటీ సభ్యులు యం.మల్లికార్జున, వై రామాంజనేయులు, యుటిఎఫ్ నాయకులు వి పాపయ్య, ఈ కృష్ణమూర్తి, ఫయాజుద్దీన్, పెద్దయ్య రుద్రమణి లింగన్న, శివకుమార్ గౌడ్, సిద్ధప్ప, హనుమంతు, మల్లయ్య, మల్లికార్జున, వెంకటరమణ, విష్ణు, రంగనాయకులు, ఆంజనేయులు, ఆవుల బసప్ప, వీర రంగన్న, నాగేంద్ర, పరమేష్, ఓంకార్, నారాయణ, కృష్ణుడు, రాముడు, రాజా, హుస్సేన్, ఎల్కే బసప్ప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల శ్రేయస్సుకు తోడ్పడండి

- 5వ రోజు కొనసాగిన మున్సిపల్ కార్మికుల సమ్మె - ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డికి వినతి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికుల శ్రేయస్సుకు తోడ్పడాలని ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డికి మున్సిపల్ కార్మికులు వినతి పత్రం అందజేశారు. ఆదివారం ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డికి సిఐటియు తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు సి గోవిందు, బి రాముడు, ఐఎఫ్‌టియు తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ రాజు, కే ప్రసాద్, మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ యూ నియన్ నాయకులు జై నాగరాజు, సాల్మన్, కె ఇస్మాయిల్, ప్రతాప్ బృందం ఆధ్వర్యంలో ఆరవ రోజు సమ్మెలో భాగం గా కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఎన్నికల ముందు మున్సిపల్ కార్మికులను రెగ్యులరైజ్ చేస్తామని, కనీస వేతనం అమలు చేస్తామని హామీ ఇచ్చారని అయితే 4 సంవత్సరాల 9 నెలలు కావస్తున్న ప్పటికీ అమలు చేయకపోవడంతోనే సమ్మె బాట పట్టాల్సి వచ్చిందన్నారు. కావున మున్సిపల్ కార్మికుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందిస్తున్న మున్సిపల్ కార్మికులు

కెవిపిఎస్ మద్దతు

మున్సిపల్ కార్మికులు చేపట్టిన దీక్షలకు కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు ఎస్ దేవ సహాయం, తాలూకా మండల బాధ్యులు కనకవీడు రాజు ఎస్ ఆంటోనీ, కే రాజు మద్దతు తెలిపి ప్రత్యక్షంగా పరోక్షంగా అండగా ఉంటామని తెలిపారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి రామాంజనేయులు తమ మద్దతు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఆయన కోరారు. మున్సిపల్ కార్మికుల సమ్మెను నిర్వీర్యం చేయడానికి పోలీసులతో అధికారులతో బెదిరిస్తే సహించమని తెలిపారు. సమస్యలు పరిష్కరించేంత వరకు సమ్మె విరమింప చేసేది లేదని పేర్కొన్నారు. ఈ సమ్మె కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక సంఘ నాయకులు బి మునీంద్ర, దేవ మాత, సుశీలమ్మ, జిలాని, నల్లన్న, లక్ష్మన్న, పెద్ద కేసన్న, మల్లికార్జున, సుజాత, తులసమ్మ, తదితరులు పాల్గొన్నారు. **ఆదోని :** ఎన్నికల ముందు మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని ఇచ్చిన హామీలను అమలు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి రామాంజనేయులు, పి ఈరన్న, పట్టణ అధ్యక్షులు తిప్పన్న డిమాండ్ చేశారు. ఆదివారం ఆదోనిలోని పంప్ హౌస్ వద్ద 5వ రోజు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంజనీరింగ్ కార్మికులను పర్మినెంట్ చేసి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, మున్సిపల్ ఇంజనీరింగ్ సెక్షన్ వాటర్, ఎలక్ట్రికల్ కార్మికులను వారి సర్వీసును పరిగణలోకి తీసుకొని పర్మినెంట్ చేయాలన్నారు. న్యాయబద్ధంగా చేస్తున్న సమ్మెను ప్రభుత్వం పరిగణలోకి తీసుకొని చర్చలు జరపాలన్నారు. నిత్యవసర సరుకులు ధరలు రోజురోజుకు పెరుగుతున్న ఈ నేపథ్యంలో చాలీచాలని వేతనాలు సరిపోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు కర్రెప్ప, కార్యదర్శి సోమన్న, అహ్మద్, మూర్తి, ఈరన్న, కార్మికులు పాల్గొన్నారు.



కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న రామాంజనేయులు



అక్రమ మద్యం వ్యాపారులను అరెస్ట్ చేసిన పోలీసులు

అక్రమ మద్యం వ్యాపారుల అరెస్ట్

ప్రజాశక్తి - మంత్రాలయం

మండల పరిధిలోని మాధవరం తండా గ్రామంలో అక్రమ మద్యం వ్యాపారులు చేస్తున్న సుగాలి సూర్య నాయక్, సుగాలి హనుమంతు నాయక్, సుగాలి శివాజీ నాయక్‌లను అరెస్టు చేసినట్లు మాధవరం ఎస్ఐ కిరణ్ బాబు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రహస్య సమా చారంతో ఎం తండా గ్రామంలో ఆకస్మికంగా తనిఖీ చేయగా ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి మాధవరం తండాలో ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాలకు చెందిన అక్రమంగా ఉన్న మద్యంను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇందులో కింగ్ ఫిషర్ 29 బాటిల్స్, మాన్షన్ హౌజ్ 17 బాటిల్స్, ఒరిజినల్ ఛాయిస్ 6 టెట్రా పాకెట్స్, 05 లిటర్స్ నాటు సారాను సీజ్ చేసిన్నట్లు పేర్కొన్నారు. అనంతరం పొలాల్లో ఉన్న సుమారు వెయ్యి లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేసి, ముగ్గురు వ్యక్తులపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కి తరలించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎఎస్ఐ బందే నవాబ్, పోలీసులు సోమ శేఖర్, వీరాంజి, వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

35 ఏళ్ల తర్వాత అపూర్వ కలయిక



కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి-ఆలూరు

ఆలూరు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల -2లో 1988-89లో పది పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు 35 ఏళ్ల తర్వాత చదువుకున్న పాఠశాలలో ఆదివారం కలుసుకున్నారు. అలనాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటూ సరదాగా గడిపారు. ఈ కార్యక్రమంలో ఆలూరు టిడిపి మాజీ ఇంఛార్జి వైకుంఠం శివప్రసాద్, ఆలూరు తహశీల్దార్ రామాంజినేయులు,పుల్లయ్య ఇంజనీరింగ్ కళశాల చీఫ్ గిరిబాబు మాట్లాడుతూ మిత్రులందరిని చాలా ఏళ్ళ తర్వాత కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు జీరాగౌడ్, మెడికల్ షాప్ మల్లి,శర్మాస్,టైలర్ జయరామ్,ఆకుల గాదిలింగ,ఫోటో స్టూడి యో మూర్తి,షేక్ అహ్మద్,హతిబెలగల్ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

బృందావనానికి వెండి కవచాలు విరాళం

ప్రజాశక్తి - మంత్రాలయం

నంజనగూడ శ్రీ రాఘవేంద్రస్వామి మఠం నిర్వహణలో మైసూరు బ్రాంచిలో శ్రీ రాఘవేంద్రస్వామి మృత్తికా బృందావనానికి కర్నాటక రాష్ట్రంలోని మైసూరుకు చెందిన గుండాచార్ అనే భక్తుడు వెండి కవచాలను విరాళంగా అందజేశారు. ఆదివారం రాఘవేంద్రస్వామి దర్శనార్థమై కుటుంబ సభ్యులతో కలిసి మంత్రాలయం వచ్చిన వారు రాఘవేంద్రస్వామిని దర్శించుకొని మంగళ హారతులు స్వీకరించారు. అనంతరం శ్రీ మఠం పీఠాధిపతులు శ్రీ సుభుదేంద్రథీర్థులను కలుసుకుని శ్రీ మఠం గర్భగుడిలో రాఘవేంద్రుని మూల బృందావనం వద్ద వెండి కవచాలను అందజేసి ఆశిస్సులు పొందారు.

గ్రామాల్లో పడకేసిన పారిశుధ్యం

- రోగాల బారిన పడుతున్న ప్రజలు
- కనిపించని నివారణ చర్యలు

ప్రజాశక్తి -హోళగుంద

మండలంలోని అనేక గ్రామాల్లో ఎక్కడ చూసినా పరిశుభ్రత పడకేసింది. ఆయా గ్రామాల్లో వివిధ అనారోగ్య సమస్యలను ఎదుర్కొ ంటున్నారు. ఈగలు సంచరించడం వల్ల రోగాల బారిన పడుతున్నామని మండల ప్రజలు పేర్కొంటున్నారు. ఎక్కడ కూర్చున్నా.. నిల్చున్నా దుర్వాసన వెదజల్లుతోందని, దీనికి తోడు పందులు సంచరించడం, మల, మూత్ర విసర్జనలతో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారిందని గ్రామస్తులు పేర్కొం టున్నారు. కేంద్ర ప్రభుత్వం గతంలో మరుగుదొడ్లు నిర్మించిన అవి ఇప్పటి వరకు వాడకంలో రాలేకపోయాయి. అందుకు అధికారుల నిర్లక్ష్యం అని పలువురు పేర్కొంటున్నారు. మురుగుదొడ్లను వినియోగించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించవలసిన అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. పంచాయతీలలో నిధులు లేవన్న సాకుతో పంచాయతీ కార్యదర్శులు వచ్చామా పోయే మా అన్న చెందగా వ్యవహరిస్తున్నారని మండల ప్రజలు మండిపడుతున్నారు. మేజర్ గ్రామపంచాయతీలలో అయితే ప్రజలు కట్టిన టాక్సీవాలా వచ్చిన బకాయిలు దుర్వినియోగం అవుతున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత నెల రోజులుగా ప్రతి గ్రామంలో



ఇళ్ల మధ్యలో పందులు సంచరిస్తున్న దృశ్యం



పూడిక తీయకపోవడంతో కాలువలో నిలిచిన మురుగు నీరు

ప్రతి వీధిలో పుట్టగొడుగుల్లా దోమలు పుట్టుకొచ్చి సంచరిస్తూ ప్రజలకు మనశ్శాంతి లేకుండా చేస్తున్నాయి. ఉదయం సాయంత్రం అనే తేడా లేకుండా బాత్రూంలో, టాయిలెట్లలో కూడా దోమల అధిక సంఖ్యలో ఉండటం వల్ల అసౌకర్యాలకు గురవుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. తిను బండరాలపై వాలి ఆహారాన్ని సైతం కలుషితం అవుతోందని, దీంతో రోగాల బారిన పడి రోజు సంపాదించిన కూలీ డబ్బులు సైతం ప్రైవేట్ హాస్పిటల్‌లో ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని సామాన్యులు మండిపడుతున్నారు. మండలంలో అనేక గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడం వల్ల బహి రంగ ప్రదేశాల్లో కుంటల్లో కలుషితమైన నీరు ఉండటం వాటి ప్రభావంతో దోమలు మరింత వృద్ధి చెంది ఇబ్బందులకు గురి చేస్తున్నాయని మండల ప్రజలు వాపోతున్నారు. దోమల నివారణకు మేజర్ గ్రామ పంచాయతీ, ఆయా గ్రామపంచాయతీ వారు దోమల నివారణకు చర్యలు చేపట్టవలసి ఉన్న తూ తూ మంత్రంగా నివారణ చర్యలు ఉండటంతో దోమలు మరింత వృద్ధి చెందుతున్నాయని మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఏ గ్రామానికి వెళ్ళిన రోడ్లపై మురికి నీరు నిలవడం, ప్రతి వీధిలో చెత్త చెదరం ఉండటం వల్ల అశుభ్రత తాండవిస్తుంది. పందుల పెంపకం దారులు ఊరు చివరలో జనసంచారం లేని చోట పెంచుకోవాలని, లేదంటే పందులను ఊరి నుండి శాశ్వతంగా బహిష్కరించాలని ప్రజలకు కోరుతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి పందులు గ్రామాల్లో సంచారించకుండా తగు చర్యలు తీసుకొని,దోమల నివారణ చర్యలు చేపట్టుటకు మండల అధికారులకు, ప్రజాప్రతినిధులకు సలహాలు సూచనలు ఇచ్చి దోమలు వృద్ధి చెందకుండా అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

దుర్వాసన వెదజల్లుతోంది

- బుడగ జనగాల రామాంజనేయులు, జంగాల కాలనీ వాసి.



పారిశుధ్యం సరిగా లేక జంగాల కాలనీలో దుర్వాసన వెదజల్లుతోంది. మేజర్ గ్రామపంచాయతీ అధికారులు పట్టించుకోవడంలేదు. రోడ్లు, డ్రైనేజ్ వ్యవస్థ లేక నడిరోడ్డుపై నీరు పారుతున్నాయి. దోమలు వృద్ధి పెరిగి రోగాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి డ్రైనేజీ వ్యవస్థ తీసి రోడ్ల నిర్మాణం చేపట్టి పారిశుధ్య పనులు చేపట్టాలి.

నిధుల కొరతతో పనులు చేపటలేకపోతున్నాం

- చంద్రమౌళీశ్వర గౌడ్, ఇఒపిఆర్‌డి.



మండలంలో నిధుల కొరత ఉంది. అందువల్ల పూర్తిస్థాయిలో డ్రైనేజ్‌తో పాటు సిసి రోడ్లు నిర్మాణం చేపట్ట లేకపోతున్నాం. చెత్తాచెదరం వంటి సమస్యలను సిబ్బందితో మాట్లాడి తగు చర్య తీసుకుంటాం.



జెండాను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

విద్యా సమస్యలపై నిరంతర పోరాటం : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - ఆస్పరి

విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాడి సమస్యలను పరిష్కరిం చడంలో ఎస్ఎఫ్ఐ ముందుంటుందని మాజీ డివైఎఫ్ఐ సీనియర్ నాయకులు బాలకృష్ణ అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన ఆస్పరిలోని జడ్పీహెచ్ హైస్కూల్ ఆవరణంలో ఎస్ఎఫ్ఐ 54వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి రవి జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ 1970 డిసెంబర్ 31న స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సోషలిజం నినాదంతో కేరళ రాష్ట్ర రాజధాని త్రివేంద్రంలో ఏర్పడిందన్నారు. ఆనాటినుండి నేటి వరకు విద్యార్థి సమస్యల పరిష్కారం కోసం దేశవ్యాప్త ంగా ఎన్నో పోరాటాలు చేయడం జరిగింద న్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గత ఎన్నికలలో అధికా రంలోకి రాగానే నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తామని,జాబ్ క్యాలండర్ విడుదల చేస్తామని హామీలు ఇచ్చారు తప్ప ఆచరణలో శూన్యం అన్నారు. విద్యా పరిరక్షణ కోసం ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున పోరాటాలను నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు.

కబడ్డీ ఆడుతూ అంగన్‌వాడీల నిరసన



మంత్రాలయం: కబడ్డీ ఆడుతూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి - విలేకరులు

మంత్రాలయం: ఆడదాం ఆంధ్ర క్రీడల్లో నిమగ్నమైన ప్రభుత్వానికి అంగన్‌వాడీలు కబడ్డీ ఆడుతూ తమ డిమాండ్లను కూత ద్వారా వినిపించి విన్నూత్న నిరసన వ్యక్తం చేశారు. స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె 20వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్ష ఉపాధ్యక్షులు విశాలాక్షి భీమేశ్వరిలు మాట్లాడారు. న్యాయమైన కోరికలను పరిష్కరించాలని చేపట్టిన సమ్మెపై ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి స్పందించకపోవడం బాధాకరమన్నారు. మాట తప్పను మడమ తిప్పనని చెప్పిన జగన్మోహన్ రెడ్డి అంగన్‌వాడీల హామీలో మాట తప్పారని ఆరోపించారు. గత 20 రోజులుగా అంగన్‌వాడీలు సమ్మె చేస్తూ ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం సంభరాలు జరుపుకోవడం విచారకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ డిమాండ్లను పరిష్కరించాలని లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు లావణ్య, ప్రమీల, జానకి, ఫాతిమా, జాత రంగమ్మ, విజయమ్మ తదితరులు పాల్గొన్నారు. **ఆదోని :** ఎన్నికల ముందు అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీ మేరకు న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి రామాంజనే యులు, ఈరన్న డిమాండ్ చేశారు. ఆదివారం ఆదోనిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద అంగన్న్వాడీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటమ్మ ప్రాజెక్టు యూ నియన్ నాయకురాలు పద్మ, సరోజ, జానకి ఆధ్వర్యంలో సమ్మె కొనసాగిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయమైన సమస్యలు పరిష్కరి ంచాలని కోరుతున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాచుటీ ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5 లక్షలకు పెంచాలని, పెన్షన్స్ సౌకర్యం చివరి జీతంలో 50 శాతం ఇవ్వాలని, రాజకీయ జోక్యాన్ని అరికట్టాలని, సూపర్వైజర్ ప్రమోషన్‌కు 50 సంవత్సరాలు పెంచాలని, సర్వీసులో చనిపోయిన అంగన్‌వాడీ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, రిటైర్మెంట్ వయసు 62 సంవత్సరాలకు పెంచాలని, వేతనంతో కూడిన లీవ్ సౌకర్యం కల్పించాలని, మెనూ ఛార్జీలను పెంచాలని, గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని, పెండింగ్ సెంటర్ అద్దెలు టిఏ బిల్లులు ఇవ్వాలని, ఫేస్ యాప్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు లింగన్న, అంగన్వాడీ వర్కర్లు సోమక్క, గీత, వీరమ్మ, మీనా కుమారి, రిజ్వానా, శారద, ఈరమ్మ, అంగన్వాడీలు వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు. **ఆలూరు :** అంగన్వాడీ మహిళల పోరాటాలపై పోలీసు దాడులు,అరెస్టులు చేపిస్తున్న కసాయి ప్రభుత్వాన్ని గద్దె దించుతామని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కెపి.నారాయణ స్వామి,ఏపి అంగన్వాడీ వర్కర్స్,హెల్పర్స్ యూనియ న్ తాలుకా కార్యదర్శి జయశ్రీ అన్నారు. అంగన్‌వాడీల సమస్యలను పరిష్క రించాలని సమ్మెలో భాగంగా ఆలూరులో సమ్మె శిబిరం ఆవరణలో అంగన్వాడీలు కబడ్డీ ఆట ఆడుతూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అన్ని యాప్‌లను కలిపి ఒకే యాప్‌గా పెట్టాలని, తమకు రావలసిన టిఏ,డిఏ బిల్లులు చెల్లించాలని, ఖాళీగా ఉన్న సూపర్వైజర్ పోస్టులను భర్తీ చేయాలని, ఐసిడిఎస్ ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలని అన్నారు. ఈ కార్యక్రమానికి సిఐటియు నాయకులు కృష్ణ,డివైఎఫ్ఐ నాయకులు గోవర్ధన్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు భారతి, బాలరంగమ్మ, లక్ష్మీ,సరస్వతి, సుజాత,ప్రభావతి, పుష్పవతి,వెంకటలక్ష్మి ఆలూరు ప్రాజెక్టు అంగన్వాడి వర్కర్లు, హెల్పర్లు సమ్మెలో పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు :** ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి బి గోవర్ధనమ్మ, నాగలక్ష్మి, నాగేశ్వరమ్మ, శిరోమణి, కృష్ణవేణి, సిఐటి యు తాలూకా కార్యదర్శి రాముడు, ఏఐటీయూసీ తాలూకా కార్యదర్శి తిమ్మ గురుడు తదితరులు ప్రభుత్వ అబద్దాల ప్రకటనలను నిరసిస్తూ కుర్చీలాట ఆడి నిరసన తెలిపారు. ఏపీ అంగన్వాడీ వర్కర్ యూనియన్ చేపట్టిన సమ్మెకు సిపిఐ జిల్లా పట్టణ నాయకులు మునెప్ప రంగన్న మద్దతు తెలిపారు. అంగన్వాడీల సమస్యల పరిష్కారం పట్ల ప్రభుత్వ నిర్లత వైఖరిని, ప్రభుత్వ చర్యలు తీవ్రంగా ఖండించారు.



ఎమ్మిగనూరులో..



ఆలూరులో..



నిరుపయోగంగా ఉన్న మినరల్ వాటర్ ప్లాంట్

నిరూపయోగంగా మినరల్ వాటర్ ప్లాంట్

- రూ 5 లక్షల ప్రజాధనం దుర్వినియోగం

ప్రజాశక్తి - దేవనకొండ

గ్రామీణ ప్రాంత ప్రజల దాహార్తిని తీర్చడానికి కలుషితం లేని శుద్ధిచేసిన మంచి నీటిని అందించాలనే సదుద్దేశంతో జలజీవని పథకం కింద రూ.5 లక్షలతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్ గ్రామంలో నిరుపయోగంగా మారింది. దీంతో ప్రభుత్వం వెచ్చించిన లక్షల నిధులు దుర్వినియోగమ యాయన్న ఆరోపణలు ఉన్నాయి. వివరాల్లోకి వెళితే మండలంలోని లకం దిన్నె గ్రామంలో గత రెండేళ్ల క్రితం రూ.5 లక్షలు వెచ్చించి మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. దానిని నిర్మించిన కాంట్రాక్టర్ నాణ్యత ప్రమాణాలు పాటించక పోవడంతో నాసిరకంగా నిర్మించారని ఆ గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఆర్భాటంగా వాటర్ ప్లాంట్ ప్రారంభించినప్పటికీ నేటిదాకా గ్రామస్తులకు ఎటువంటి ఉపయోగకరంగా లేక నిరుపయోగంగా మారింది. సంబంధిత శాఖ అధికారులు మినరల్ వాటర్ ప్లాంట్‌ను సందర్శించి గ్రామస్తులకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మాలమల్లేశ్వర స్వామిని దర్శించుకున్న కురువ సంఘం నేతలు

ప్రజాశక్తి-ఆలూరు

ఆలూరు నుండి దేవరగట్టు మాలమల్లేశ్వరస్వామి వరకు ఆదివారం శశికళకృష్ణమోహన్ ఆధ్వర్యంలో చేపట్టిన మదాసి,మదారి కురువ సంఘం నాయకులు కాలినడకన వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మాజీ డిప్యూటీ మేయర్ శశికళ కృష్ణమోహన్ మాట్లాడుతూ ఈ నెల 24న ఆలూరులో నిర్వహించిన మదాసి,మదారి కురువ మహా సింహ గర్జన సభ విజయవంతమైన సందర్భంగా ఆలూరులోని శ్రీరాముని దేవాలయం నుండి కాలినడకన అరికేర మీదుగా 15 కి.మీ. వెళ్లి దేవరగట్టు మాల మల్లేశ్వర స్వామిని దర్శించుకొని మొక్కును తీర్చుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మదాసి,మదారి కురువ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు డి.రంగన్న,తెలుగు రాష్ట్రాల సమన్వయ కర్త తిమ్మప్ప,రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుమ్మకొండ రాజు,కుల బాంధవులు శివ,గర్జప్ప,మధు,మురళి, ఉచ్చిరప్ప,ఎంకప్ప,మల్లికార్జున,ప్రకాష్,బీరప్ప,చంద్ర,శివప్ప,లింగమూర్తి పాల్గొన్నారు. మిత్రులు,శ్రేయోభిలాషులు పాల్గొని విజయవంతం చేయగలరని కోరారు.



.స్వామివారి సన్నిదిలో కురువ సంఘం నాయకులు

అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు : డిఎస్‌పి

ప్రజాశక్తి - ఆదోని

నూతన సంవత్సర వేడుకలు పురస్కరించుకొని నిబంధనలను అతిక్రమించి శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డిఎస్‌పి శివ నారాయణ స్వామి హెచ్చరించారు. ఆదివారం ఆదోని డిఎస్‌పి కార్యాలయంలో మాట్లాడుతూ డీజేలకు అనుమతి లేదన్నారు. బాణసంచా కాల్చడం గాని, ఇతురులకు ఇబ్బంది పెట్టడం చేయరాదన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడంగాని, మోటార్ సైకిళ్లపై ముగ్గురు వ్యక్తులు ప్రయాణించడం చేయరాదన్నారు. నేషనల్ హైవే పై, ఇతర రోడ్లపై బైకు రేసులు పూర్తిగా నిషేదమన్నారు. అదోని పట్టణ, మండలంలోని గ్రామాల్లో బ్లూ కోట్, రక్షక్ టీం, మొబైల్స్, ప్రత్యేక మొబైల్స్‌తో ఆ రోజు రాత్రి గస్తీ నిర్వహిస్తామన్నారు. వీధులలో, లేదా రోడ్లపై ఎటువంటి కేక్ కటింగ్ కార్యక్రమాలకు అనుమతి లేదని, కేక్ కటింగ్ చేయాలనుకునే వారు తమ ఇళ్లలోనే వారి కుటుంబ సభ్యులతో న్యూ ఇయర్ వేడుకలు చేసుకోవాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయం వరకు మాత్రమే బార్స్, హోటల్స్, రెస్టారెంట్లకు అనుమతి ఉంటుందని, ఇతరులకు ఇబ్బంది కలిగించే ఎటువంటి ఎంటర్టైన్మెంట్ కార్యక్రమాలు పబ్లిక్, ప్రైవేట్ ప్రదేశాలలో నడుపుటకు అనుమతి లేదని పేర్కొన్నారు. ప్రత్యేక కార్యక్రమాలకు ముందస్తు పోలీసు అనుమతి తీసుకోవాలన్నారు. సోషల్ మీడియాలో అభ్యంతకరమైన, అసభ్యకరమైన అంశాలు పోస్ట్ చేయరాదన్నారు. ద్విచక్ర వాహనాలకు సైలెన్సర్లు తీసి అధిక శబ్దాలతో రోడ్లపై నడిపే వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. కాలనీలలోని వీధి దీపాలను ధ్వంసం చేయడంగాని, ప్రభుత్వ సంస్థల ఆస్తులకు నష్టం కలిగించడం గాని చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. తమ పిల్లలపై పెద్దలు శ్రద్ధ చూపి ప్రశాంతంగా వేడుకలు నిర్వహించుకోవాలని విజ్ఞప్తి చేశారు.



మాట్లాడుతున్న డిఎస్‌పి శివ నారాయణ స్వామి





గోడపై కూర్చుని ఉన్న చిరుత పులి

కొత్త ఏడాదిలోనైనా తీరేనా?

- జిల్లాను వెంటాడుతున్న సమస్యలు
- పరిష్కారం వైపు ప్రజల ఆశలు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

నంద్యాల జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులకు అడుగులు ఇటుకంతైనా పడటం లేదు. దీంతో కరవు, వలసలు ఆగడం లేదు. దానికి తోడు జిల్లాలో సమస్యలు కూడా తీవ్ర స్థాయిలో ఉన్నాయి. పాత ఏడాది గతించి కొత్త ఏడాదిలోకి అడుగుపెట్టిన నేపథ్యంలో ఈ కొత్త ఏడాదిలోనైనా పాలకులు జిల్లాలోని సమస్యల వైపు చూస్తారేమో అని జిల్లా వాసులు ఆశతో ఎదురుచూస్తున్నారు..

సాగని జొలదరాసి

కోవెలకుంట్ల మండలం జొలదరాసి పైలెట్ ప్రాజెక్టుకు 2006లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ సంవత్సరంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి భూమి పూజ చేసినా ఇంతవరకు పనులు ప్రారంభించలేదు. భూసేకరణ కూడా జరగలేదు. ఆళ్లగడ్డ, శిరివెళ్ల, చాగలమర్రి, రుద్రవరం మండలాల్లో తెలుగు గంగ లైనింగ్ పనులు ముందుకు సాగడం లేదు.

రాజోలికి పడని అడుగులు

చాగలమర్రి మండలంలో రాజోలి వద్ద నిర్మించనున్న రిజర్వాయర్‌కు అడుగులు పడలేదు. ప్రతి ఏటా కుందూ నది నుంచి వచ్చే వరద నీరు సోమశిలకు చేరి, ఆ తరువాత సముద్రంలో కలిసి వృథా అవుతోంది . దీంతో రాజోలి వద్ద 2.95 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మించాలన్న ప్రతిపాదన ఉంది. 2008 డిసెంబరు 24న అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశే ఖర్ రెడ్డి రిజర్వాయర్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆ తరువాతి ప్రభుత్వాలు పట్టించుకోకపోవ డంతో నీటి వృథా కొనసాగుతోంది. జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాకా 2.95 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మాణానికి జీవో ఇచ్చారు. రూ .1,357.10 కోట్లతో చేపట్టే పనులకు జ్యుడీషియల్ ప్రివ్యూ ఆమోదం లభించింది. ఈ పనులకు జలవనరుల శాఖ నోటిఫికేషన్ కూడా జారీ చేసింది. అయినా ఇప్పటి వరకూ పనులు ప్రారంభం కాలేదు.

మారని 'నూతన' పాలన

గతేడాది ఉగాది రోజున రాష్ట్రంలో నూతన జిల్లాలను ప్రకటించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో భాగంగా ఉన్న నంద్యాల కొత్త జిల్లాగా ఏర్పడింది. నూతన జిల్లా ఏర్పడి ఏడాది పూర్తయినా జిల్లాలో పాలన స్తబ్ధతగా సాగుతోంది. జిల్లా కార్యాలయాలకు కావలసిన మౌలిక సదుపాయాలు ఇంకా పూర్తి స్థాయిలో ప్రభుత్వం కల్పించలేదు. జిల్లాలకు ప్రధాన పరిపాలనా విభాగమైన కలెక్టరేట్‌కు ఆర్ఎఆర్ఎస్‌లోని ల్యాబొరేటరీలో 3 గదులను కేటాయించారు. కలెక్టర్, జెసి, డిఆర్ఒ



ఛాంబర్‌లను అక్కడ ఏర్పాటు చేశారు. అవసరమైన మౌలిక వసతులేవీ అక్కడ లేవు. సరిపడా గదులు లేకపోవడంతో డిఆర్ఒ కార్యాలయ సిబ్బంది నంద్యాల ఆర్‌డిఒ కార్యాలయం నుంచి విధులు నిర్వహిస్తున్నారు. అక్కడ కూడా కనీస సదుపాయాలేవీ లేవు. పలు కార్యాలయాల్లో నేటికీ ఇంకా అరకొర సౌకర్యాలే ఉన్నాయి. అనేక జిల్లా ప్రభుత్వ కార్యాలయాల్లో కనీస వసతులు లేవు.

శ్రీశైలంలో చిరుత పులి

- భయాందోళనలో స్థానికులు, భక్తులు

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైలంలో మరోసారి చిరుతపులి సంచరించింది. శనివారం రాత్రి రత్నానంద స్వామి ఆశ్రమం ప్రాంగణంలో హోమగుండం గోడపై చిరుత పులి కూర్చొని ఉండడాన్ని ఆశ్రమ వాసులు చూసి భయాందోళన చెందారు. వెంటనే ఫారెస్ట్ శాఖ సిబ్బందికి ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. వెంటనే ఫారెస్ట్ సిబ్బంది అక్కడికి చేరుకొని టపాకాయలు పేల్చడంతో చిరుత పులి అడవిలోకి వెళ్లిపోయింది. అయితే అప్పుడప్పుడు స్థానికులకు దర్శనమిస్తున్న చిరుత పులి ఏ క్షణంలో ఎవరిపైన దాడి చేస్తుందోనని కొండ ప్రాంతానికి సమీపంలో ఉన్న శ్రీశైల వాసులు భయాందోళన చెందుతున్నారు. రెండు నెలల క్రితం టోల్‌గేట్ సమీపంలో ఉన్న దాసరివారి సత్రం కాంపౌండ్ గోడపై చిరుత పులి సంచరించింది. గతంలో తరచూ రెండు రోజులకు ఒకసారి చిరుతపులి కనబడుతూ రింగ్‌రోడ్‌లో దర్శనమిస్తూ ఉండేది. అలాగే తెలుగు యూనివర్సిటీ సమీపంలో చిరుత పులి, ఎలుగుబంట్ల సంచారం పెరగడంతో ప్రతిరోజు టపాకాయలు పేలుస్తూ అడవి జంతువులు ఆ ప్రాంతానికి రాకుండా చర్యలు తీసుకుంటున్నారు. అటవీ శాఖ సిబ్బందికి యాత్రికుల నుండి వసూలు చేసే టోల్‌గేట్ రుసుముపై ఉన్నంత శ్రద్ధ అడవిపై, జంతువులపై శ్రద్ధ లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మనుషులు, వాహనాలు రోడ్లు దిగకుండా కంచ వెయ్యడం వంటి వాటిపై ఎక్కువ శ్రద్ధ చూపుతున్న అటవీ శాఖ అధికారులు అడవి జంతువులు జనసంచారంలోకి రాకుండా, దాడి చేయకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు, ప్రయాణికులు, భక్తులు కోరుతున్నారు.



నంద్యాలలో మున్సిపల్ కార్మికుల సమ్మెనుద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు ఏసురత్నం

సంక్షేమ పథకాలను వర్తింపజేయాలి

- సిఐటియు జిల్లా అధ్యక్షులు వి.ఏసురత్నం
- 6వ రోజు కొనసాగిన మున్సిపల్ కార్మికుల సమ్మె
- ఆత్మకూరులో భిక్షాటన, నందికొట్కూరులో అర్ధనగ్న ప్రదర్శన
- ఆళ్లగడ్డలో కమిషనర్ చీపురు పట్టి చెత్త ఊడ్చేందుకు యత్నం - అడ్డుకున్న కార్మికులు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు వి.ఏసురత్నం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కారం చేయాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు మున్సిపల్ కార్యాలయం ఎదురుగా చేపట్టిన సమ్మె ఆదివారం 6వ రోజుకు చేరకుంది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు వి.ఏసురత్నం మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు, సమాన పనికి సమాన వేతనం, జీవో నెంబర్ 7 ప్రకారం స్కిల్డ్, సెమి స్కిల్డ్ వేతనాలు అర్హులైన కార్మికులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను, అసెంబ్లీలో చెప్పిన మాటలను నెరవేర్చాలన్నారు. జనవరి ఒకటో తేదీ మున్సిపల్ కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కారం చేసి తీపి కబురు అందించాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మణ్, కే మహమ్మద్ గౌస్, యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు కృష్ణయ్య, భాస్కరాచారి, నాయకులు రామకృష్ణ, ఆదాము, రామాంజనేయులు, నాగేశ్వరరావు, రమణ, సిద్దయ్య, కార్మికులు పాల్గొన్నారు. **ఆత్మకూర్ :** పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం దగ్గర మున్సిపల్ కార్మికులు నిరవధిక సమ్మెలో భాగంగా భిక్షాటన చేపట్టి నిరసన తెలిపారు. సిఐటియు పట్టణ అధ్యక్షులు రజాక్, కార్యదర్శి రామ్ నాయక్, ఉపాధ్యక్షులు రణధీర్, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు నాగన్న, **మిగతా 6వ పేజీలో...**

ఆటపాటలతో నిరసన

- కబడ్డీ, ఖోఖో, కుర్చీలాట, కోలన్నలు, క్రికెట్, పాటలు
- నంద్యాలలో సిఎం, మంత్రుల ప్లకార్డులను మెడలో వేసుకుని..
- 20వ రోజు కొనసాగిన అంగన్‌వాడీల సమ్మె

ప్రజాశక్తి - విలేకరులు

నంద్యాల జిల్లాలో 20వ రోజు అంగన్‌వాడీల సమ్మె కొనసాగింది. నంద్యాలలో సిఎం, మంత్రుల ప్లకార్డులు మెడలో వేసుకుని నిరసన తెలిపారు. బేతంచెర్ల, ఆత్మకూరు, నందికొట్కూరు, రుద్రవరం, చాగలమర్రి, ఆళ్లగడ్డ, బనగానపల్లె, డోన్, పాణ్యం తహాశీల్దార్ కార్యాలయాలు ఎదుట దీక్షా శిబిరాల వద్ద అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు ఆట పాటల ద్వారా నిరసన చేపట్టారు. కుర్చీల ఆట, కబడ్డీ, ఖోఖో తదితర ఆటలు ఆడారు. ఆత్మకూరులో బసవన్నకు వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. పాములపాడులో అంగన్వాడీలకు ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ రాజశేఖర్ మద్దతుగా పాల్గొని మాట్లాడారు.

నంద్యాల కలెక్టరేట్ : అంగన్వాడీలు తమ సమస్యలు పరిష్కరించాలని గత 20 రోజుల నుండి నిరవధిక సమ్మె చేపడుతున్నా ప్రభుత్వంలో చలనం లేదు. సచివాలయ ఉద్యోగులతో అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ చేపట్టినప్పటికీ సరైన ఫలితాలు లేవు. లబ్దిదారులకు రేషన్‌ను, పాలు, గుడ్లు వంటి పోషకారాన్ని సక్రమంగా అందించలేకపోతున్నారనే విమర్శలు వస్తున్నాయి. సమ్మె పట్ల ప్రభుత్వం ఏమాత్రం స్పందించక పోవడంతో అంగన్‌వాడీలు ఆందోళనలను రోజురోజుకు ఉధృతం చేస్తున్నారు. సమ్మెలో భాగంగా ఆదివారం జిల్లా కేంద్రంలో అంగన్‌వాడీలు సిఎం, మంత్రుల ప్లకార్డులను మెడలో వేసుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వి.యేసు రత్నం, నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షులు తోట మద్దులు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి నిర్మల మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్వాడీల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని అన్నారు. సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం చొరవ చూపాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలు సమ్మెతో గర్భిణులకు సరైన పోషకాహారం అందడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అంగన్వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టు కార్యదర్శి సునీత, జిల్లా ఉపాధ్యక్షురాలు నాగరాణి, పట్టణ కార్యదర్శి అధ్యక్షుడు ఎండి గౌస్, లక్ష్మణ్ పాల్గొన్నారు. **పాములపాడు :** అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించమంటే అధికార పార్టీ ఎమ్మెల్యేలు సమ్మెను విచ్చిన్నం చేసేందుకు బెదిరింపులకు **మిగతా 6వ పేజీలో...**



నంద్యాలలో సిఎం, మంత్రుల ప్లే కార్డ్స్ మెడలో వేసుకొని నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు



రుద్రవరంలో కోలన్నలు ఆడుతూ అంగన్వాడీల నిరసన



జిల్లా ఎస్పీ నుంచి ఉత్తమ పురస్కారం అందుకుంటున్న కోటి

ఆళ్లగడ్డ పోలీసులకు ఉత్తమ పురస్కారం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ఆళ్లగడ్డ క్రైమ్ పార్టీ పోలీసులు జిల్లా ఎస్పీ చేతులమీదుగా ఉత్తమ పురస్కారాన్ని అందుకున్నారు. డిఎస్‌పి వద్ద క్రైమ్ పార్టీలో విధులు నిర్వహిస్తున్న కోటేశ్వరరావు (కోటి), లక్ష్మీనారాయణ, మద్దిలేటిలు క్రిమినల్ కేసులలో ప్రతిభ చూపినందుకు ఉత్తమ పురస్కారాన్ని అందుకున్నారు. ఈనెల 29న ఎస్పీ కార్యాలయం వద్ద నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి వీరికి ప్రశంస పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ డిఎస్పి వెంకటరామయ్య, రూరల్ సీఐ హనుమంత నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే ఆర్థర్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

పట్టణంలోని రబ్బాని కాంప్లెక్స్‌లో ఎమ్మెల్యే తోగూరు ఆర్థర్ పుట్టినరోజు సందర్భంగా ఆదివారం ఆర్థర్ సైన్యం సభ్యులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. పట్టణంలోని పురవీధులలో నిరాశ్రయులకు ఫలహారం, ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం పట్టణ నిరాశ్రయుల వసతి గృహంలో అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మొల్ల రబ్బాని, రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ హాజీ అబ్దుల్ సుకుర్, కౌన్సిలర్ మొల్ల జాకీర్ హుస్సేన్, ఉండవల్లి ధర్మారెడ్డి, వైసీపీ జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షులు సగినెల వెంకటరమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ వనజ, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు చందమాల బాలస్వామి, నాయకులు విశ్రాంత పోలీస్ అధికారి పెరుమాళ్ళ జాన్, తమ్మడపల్లి విక్టర్, జీవన్, సుందర్రాజు, అయ్యన్న, భాస్కర్, వెంకటస్వామి, దివాకర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, షరీఫ్, తదితరులు పాల్గొన్నారు.



బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

నంద్యాల, ఆత్మకూరు మైనార్టీల మధ్య

చిచ్చుపెట్టడానికి మాజీ మంత్రి శిల్పా ప్రయత్నం : టిడిపి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాలలో మొన్న జరిగిన సామాజిక సాధికారిక బస్సు యాత్రలో మైనార్టీలను ఉద్దేశించి నంద్యాల, ఆత్మకూరు మైనార్టీలను ఇండియా, పాకిస్థాన్‌తో పోల్చి మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డి చిచ్చుపెట్టడానికి ప్రయతిస్తున్నారని టిడిపి నేతలు పేర్కొన్నారు. ఆదివారం నంద్యాలలోని టిడిపి జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్, మాజీ మంత్రి ఎన్ఎండి ఫరూక్, సీనియర్ న్యాయవాది తులసి రెడ్డి, ఎన్ఎండి.ఫిరోజ్, మాజీ కౌన్సిలర్ చింతల సుబ్బారాయుడు, గోగి శెట్టి నరసింహారావులు పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లెల రాజశేఖర మాట్లాడుతూ వైసిపి నాయకులకు సామాజిక సాధికారిక అంటే అర్థం కూడా తెలియదన్నారు. శిల్పా మోహన్ రెడ్డి తెలివి లేకుండా మైనార్టీలను ఇండియా, పాకిస్థాన్ అని సంబోధించడం తగదన్నారు. ఫరూక్ పాకిస్తానీయుడుగా కనిపిస్తున్నాడా అని ప్రశ్నించారు. మాజీ మంత్రి ఎన్ఎండి. ఫరూక్ మాట్లాడుతూ శిల్పా మోహన్ రెడ్డి మాట్లాడిన మాటలు మంచి పద్ధతి కాదన్నారు. రాజకీయాలు హుందాగా చేయాలని, మత ఘర్షణలని రెచ్చగొట్టే విధంగా మాట్లాడడం సబబు కాదన్నారు. డబ్బు, ఫ్యాక్షన్ ఎవరికి మంచిది కాదని హితబోధ చేశారు. తాతి రెడ్డి తులసి రెడీ మాట్లాడుతూ మైనార్టీలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే తన్ని తరిమిగొడతారని హెచ్చరించారు. మమ్మల్ని టచ్ చేస్తే మరో భూమా నాగిరెడ్డిని చూస్తారని ఘాటుగా వ్యాఖ్యానించారు. నంద్యాలలో ఇండియా, పాకిస్తాన్ ఫీలింగ్ తీసుకొస్తే యుద్ధానికి సిద్ధమేనన్నారు. చింతల సుబ్బారాయుడు మాట్లాడుతూ 'శిల్పా కుటుంబాన్ని ఓడించాలంటే మగాళ్లు కావాలా..?, మీ వద్ద వున్నప్పుడు మగాళ్లు కాదా, పాపం పండి మాట్లాడుతున్నావు, ప్రజలే బుద్ధి చెబుతారు' అని అన్నారు. ఫిరోజ్ మాట్లాడుతూ బస్సు యాత్ర ఫ్లాప్ అయితే సక్సెస్ అయిందని చెప్పుకోవడం విడ్డూరమన్నారు. మత కల్లోలాలు సృష్టించాలని చూస్తే భారీ మూల్యం తప్పదని హెచ్చరించారు.



మాట్లాడుతున్న టిడిపి జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్ గౌడ్

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- సిఐటియు జిల్లా అధ్యక్షులు యేసురత్నం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు యేసురత్నం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం 12వ రోజుకు చేరుకుంది. ఉద్యోగులు ఒంటి కాలిపై నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వానికి ఉద్యోగ సమస్యలపై కనీస అవగాహన లేదని, ముఖ్యమంత్రి పాదయాత్రలో ఇచ్చిన హామీలను కూడా నెరవేర్చకపోవడం దారుణమన్నారు. సమ్మెకు సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసమూర్తి మద్దతు తెలుపుతూ మాట్లాడారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో ఈ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. వికలాంగుల సంక్షేమ సంఘం నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో డిఆర్ఈఏ అధ్యక్షులు చంద్రశేఖర్, డిఆర్‌డబ్ల్యుఏ అధ్యక్షులు డిపి.మస్తాన్ వలి, వికలాంగుల ఆదరణ సేవా సమితి అధ్యక్షులు జజ్జూరి మరియదాస్ పాల్గొన్నారు.



సంఘీభావం తెలుపుతున్న వికలాంగుల సంఘం నాయకులు

ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రజాశక్తి కీలకపాత్ర : ఎంపిపి

ప్రజాశక్తి - కొత్తపల్లి

ప్రజా సమస్యలను వెలికి తీసి పరిష్కరించడంలో ప్రజాశక్తి దినపత్రిక కీలకపాత్ర పోషిస్తుందని ఎంపీపీ కుసుమలత, వైసీపీ మండల కన్వీనర్ సుధాకర్ రెడ్డి తెలిపారు. ఆదివారం కొత్తపల్లి మండలం దుద్యాల గ్రామంలో ఎంపీపీ, మండల కన్వీనర్లు ప్రజాశక్తి దినపత్రిక 2024 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాశక్తి పత్రిక నిత్యం ప్రజల పక్షం ఉంటూ, ప్రభుత్వానికి, ప్రజలకు, అధికారులకు మధ్య వారధిలా పని చేస్తుందన్నారు. ప్రతి అక్షరం ప్రజల పక్షంగా ముందుకు సాగుతుందని తెలిపారు. ప్రజాశక్తి క్యాలెండర్‌కు ఓ ప్రత్యేకత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాశక్తి డివిజన్ ఇంచార్జి శివప్ప, కొత్తపల్లి విలేఖరి స్వాములు, వైసిపి మండల నాయకులు లోకేశ్వర్ రెడ్డి, కోటీశ్వర రెడ్డి, రమేష్ బాబు, నంద్యాల ఉస్మాన్, చంద్ర, బాన్‌రెడ్డి, కళ్యాణ్, భగవాన్ రెడ్డి, రమణారెడ్డి, గోపాల్, నాయకులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపిపి, మండల కన్వీనర్ తదితరులు




మాట్లాడుతున్న డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

అపరభగీరథుడు ఆర్థిక మంత్రి కృషితో డోన్‌కు పుష్కలంగా తాగునీరు : చైర్మన్

ప్రజాశక్తి - డోన్

అపరుభగీరథుడు ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి సారథ్యంలో డోన్ మున్సిపాలిటీకి నిరాటంకంగా ప్రతిరోజు తాగునీరు అందించే కల త్వరలో నెరవేరుతుందని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ దాదాపు రూ. 300 కోట్లతో గోరుకల్లు రిజర్వాయర్ నుంచి డోన్ నియోజకవర్గంలోని ప్యాపిలి, బేతంచెర్ల, డోన్ పట్టణ, రూరల్ గ్రామాల ప్రజలకు ప్రతి గడపకు నీరు అందించే కార్యక్రమం చివరి దశకు చేరిందన్నారు. అందులో భాగంగా 2023 డిసెంబర్ 30న గోరుకల్లు ప్రాజెక్టు నుండి సుగాలి మిట్ట దగ్గర ఉన్న పంప్ హౌస్ కు నీటిని విడుదల చేశారని తెలిపారు. అక్కడ నుండి సిమెంట్ నగర్ లో 10 ఎకరాలలో నిర్మించిన పిల్టర్ పంపు హౌస్ కు జనవరి 2న నీరు వస్తుందని తెలిపారు. .పిల్టర్ చేసిన నీళ్ళు అక్కడనుండి ఒక వారం రోజులలో బేతంచెర్ల పట్టణ ప్రజలకు నీరు అందిస్తామన్నారు. ఇప్పటికే సంజీవయ్యసాగర్‌నుంచి డోన్‌కు తాగునీరు వస్తుందని , ప్రత్యేక పరిస్థితిలో అప్పుడప్పుడు ఒకటి రెండు రోజులు ఆటంకం కలిగేదని , గోరుకల్లు రిజర్వాయర్ నీరు కూడా వస్తే డోన్ పుష్కలంగా తాగునీరు అందుతుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డికి, ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డికి డోన్ ప్రజల తరుపున సప్తశైల రాజేష్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

వైసిపి మండల కన్వీనర్‌గా అంబటి గురువిరెడ్డి



ప్రజాశక్తి - కొలిమిగుండ్ల : వైసిపి కొలిమిగుండ్ల మండల కన్వీనర్‌గా అంబటి గురువిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ అంబటి గురువిరెడ్డి ఆదివారం మాట్లాడుతూ ప్రస్తుతం మండల కన్వీనర్‌గా పని చేస్తున్నప్పటికీ తనపై నమ్మకం ఉంచి మళ్లీ ఎన్నిక చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి, బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి, ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో వైసిపి బలోపేతానికి కృషి చేస్తానన్నారు. 2024 ప్రజల ఆనందాల సంవత్సరం కావాలని, ప్రతి ఇంటా సుఖ సంతోషాలు వెల్లివిరియాలని కోరుకుంటూ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

శ్రీ కాత్యాయని మెడికల్ స్టోర్ ప్రారంభం

ప్రజాశక్తి - బనగానపల్లె : పట్టణంలోని పెట్రోల్ బంక్ కూడలిలోని పోలీస్ స్టేషన్ సమీపంలో శ్రీ కాత్యాయని మెడికల్స్, సర్జికల్స్ షాప్‌ను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆదివారం ప్రారంభించారు. అనంతరం మెడికల్ షాపులో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ స్టోర్ యజమాని సురేష్ కుమార్ మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో శ్రీ కాత్యాయని మెడికల్ షాప్ ఆధ్వర్యంలో ఆరో బ్రాంచిని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సివి తిమ్మారెడ్డి, ఎస్సై రామిరెడ్డి, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.


మెడికల్ షాప్ లో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే

పేదల కోసమే ఉచిత కార్పొరేట్ వైద్య శిబిరం - డాక్టర్ పెద్దిరెడ్డి దస్తగిరిరెడ్డి

ప్రజాశక్తి - సంజామల

గ్రామీణ ప్రాంత పేదల కోసమే పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కార్పొరేట్ వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని నంద్యాల శ్రీ గురురాఘవేంద్ర బ్యాంకు కోచింగ్, విద్యా సంస్థల అధినేత చైర్మన్ డాక్టర్ పెద్దిరెడ్డి దస్తగిరిరెడ్డి తెలిపారు. ఆదివారం సంజామల మండలం మంగంపల్లె గ్రామంలో పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి ప్రజా వైద్యశాలలో 39వ ఉచిత మెగావైద్య శిబిరం పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి చారిటబుల్ సొసైటి ఆధ్వర్యంలో నిర్వహించారు. రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పి.దస్తగిరి రెడ్డి మాట్లాడుతూ నంద్యాల, కర్నూలు పట్టణానికి చెందిన అనుభవజ్ఞులైన డాక్టర్లతో వైద్య శిబిరంలో రోగులను ఉచితంగా వైద్య పరీక్షలు చేయిస్తున్నామని అన్నారు. వైద్య శిబిరానికి హాజరైన ప్రజలందరికీ పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత భోజనం ఏర్పాటు చేశామని చెప్పారు. శ్రీ గురు రాఘవేంద్ర విద్యాసంస్థల డైరెక్టర్లు మౌలాలిరెడ్డి, షేకావలిరెడ్డి మాట్లాడుతూ మా అబ్బ జ్ఞాపకార్థం పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి ట్రస్ట్ పేరున మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు.

వైసిపి మండల ప్రధాన కార్యదర్శిగా బీగాల వెంకటసుబ్బయ్య

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

వైసిపి కొలిమిగుండ్ల మండల ప్రధాన కార్యదర్శిగా బీగాల వెంకటసుబ్బయ్య ఎన్నికయ్యారు. ఆదివారం కొలిమిగుండ్లలోని బాల హుస్సేన్ నాయుడు కార్యాలయంలో మండల ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన బీగాల వెంకటసుబ్బయ్య కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకొని ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. బీగాల వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ తనకు ఈ పదవి వచ్చేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, మండల కన్వీనర్ అంబటి గురువు రెడ్డిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పి.మధుసూదన్ రెడ్డి, బాలహుస్సేన్ నాయుడు, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సన్మానిస్తున్న దృశ్యం

సంక్షేమ పథకాలను వర్తింపజేయాలి

5వ పేజీ తరువాయి.. గొడుగురాజు, జోసెఫ్, పెద్ద నాగరాజు, కార్మికులు తిమయ్య, నాగన్న, మోహన్, సురేష్, దానమయ్య, రవి, రూతమ్మ, జీవరత్నమ్మ, మణెమ్మ, సుగుణమ్మ, కుమారి, సుశీలమ్మ, తదితరులు పాల్గొన్నారు. **నందికొట్కూరు టౌన్ :** తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించి నిరసన తెలిపారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం నుండి ర్యాలీగా బయలుదేరి పటేల్ సెంటర్ చేరుకొని రాస్తారోకో నిర్వహించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు భాస్కర్ రెడ్డి, నాయకులు పరమేష్, భాస్కర్, నాగేశ్వరరావు, బాసిక్ అబ్రహం, నాగన్న, ప్రభుదాసు, ఏసన్న పాల్గొన్నారు. **డోన్ :** డోన్ పట్టణంలో సిఐటియు ఆధ్వర్యంలో ఆదివారం 6వ రోజు స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో దీక్షా శిబిరంలో మున్సిపల్ కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన చేశారు. సిఐటియు జిల్లా కార్యదర్శి జి.శివరాం, మండల,పట్టణ అధ్యక్షులు పి.రామాంజనేయులు, సత్య, శ్రీకాంత్,ఆజాద్ నాయకులు అక్బర్ బాషా,మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కుళ్లాయప్ప,అధ్యక్ష, ఉపాధ్యక్షులు గోవిందు,పెద్ద ఎల్లయ్య మాట్లాడారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు దేవదానం, యేసు, హైమారావు, ఆవులయ్య, రామాంజి, చంద్ర, సురేష్ వెంకట లక్ష్మమ్మ, అంజనమ్మ, రంగనాయకులమ్మ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డలో కమిషనర్ చీపురు పట్టి చెత్త పూడ్చేందుకు ప్రయత్నం - అడ్డుకున్న కార్మికులు, వాగ్వివాదం

ఆళ్లగడ్డ : మున్సిపల్ వర్కర్స్ తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చేస్తున్న సమ్మెలో ఆదివారం ఉద్రిక్తత పరిస్థితులు ఏర్పడ్డాయి. పారిశుద్య కార్మికుల సమ్మె కారణంగా పట్టణంలో ఎక్కడి చెత్త అక్కడే నిల్వ ఉండడంతో వాటిని తొలగించేందుకు చెత్త వాహనాలను బయటకు తీసుకెళ్లేందుకు కమిషనర్ కార్యాలయ సిబ్బంది ప్రయత్నించారు. ఈ దశలో సిఐ రమేష్ బాబు, పట్టణ ఎస్సై వెంకట్ రెడ్డి సిబ్బందితో మున్సిపాలిటీ కార్యాలయానికి చేరుకున్నారు. సమ్మెను ఆటంక పరచమని, వాహనాలను తీసుకెళ్లేందుకు అంగీకరించాలని సిఐ కార్మికులను కోరారు. అందుకు కార్మికులు ససేమిరా అంటూ మున్సిపాలిటీ కార్యాలయ గేటు వద్ద అడ్డంగా కూర్చున్నారు. బిజెపి తాలూకా బాధ్యులు భూమా కిషోర్ రెడ్డి కూడా కార్మికులకు మద్దతుగా పురపాలక కార్యాలయం వద్దకు చేరుకున్నారు. సీఐ రమేష్ బాబు, కమిషనర్ రమేష్ బాబులు కార్మికులకు ఎంత నచ్చజెప్పినా అంగీకరించలేదు. చివరకు చేసేదేమీ లేక పురపాలక సిబ్బంది, పోలీసులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. అనంతరం కమిషనర్ ఏవి రమేష్ బాబు చీపురు పట్టి వీధులను శుభ్రం చేసేందుకు ప్రయత్నించారు. వీధులను ఊడ్చేందుకు ప్రయత్నిస్తున్న కమిషనర్‌ను సమ్మెలో ఉన్న కార్మికులు అడ్డుకున్నారు. కమిషనర్ చేతిలో నుంచి చీపురు లాక్కున్నారు. తాము చేస్తున్న సమ్మెను నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నించడం సబబు కాదని కమిషనర్‌తో కార్మికులు వాదనకు దిగారు. దీంతో కమిషనర్ అక్కడి నుంచి వెళ్ళిపోయారు. ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించేంతవరకు సమ్మె కొనసాగిస్తామని మున్సిపాలిటీ కార్మిక సంఘం నాయకులు వెంకటయ్య తెలిపారు.


ఆళ్లగడ్డలో కమిషనర్‌ను అడ్డుకుంటున్న కార్మికులు



డోన్‌లో అర్ధనగ్న ప్రదర్శనతో కార్మికులు నిరసన



నందికొట్కూరులో అర్ధనగ్న ప్రదర్శనతో కార్మికులు నిరసన

ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బనగానపల్లె

నూతన సంవత్సరంలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆకాంక్షించారు. ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో కుమ్మరి శాలివాహన సంక్షేమ సంఘం క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కుమ్మరులు ఐకమత్యంతో అభివృద్ధి సాధించాలన్నారు. కుమ్మరుల సంక్షేమం కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కుమ్మరి శాలివాహన సంక్షేమ సంఘం నియోజకవర్గం గౌరవ అధ్యక్షులు బాబయ్య, అధ్యక్షుడు సురేష్, ప్రధాన కార్యదర్శి శివరాం, కార్యదర్శులు నాగరాజు, రవి, లక్ష్మన్న, గోవిందీన్నే సుబ్బయ్య, వెంకటాపురం శివయ్య, సభ్యులు కొత్తపేట రామసుబ్బయ్య, రఘురాముడు, శ్రీరాములు, మద్దిలేటి, నందవరం సుధాకర్, కొత్తపేట పెద్ద తిమ్మరాజు, నాగేంద్ర, నాగమయ్య, వేములపాడు భాస్కర్, కొత్తపేట వెంకటేశ్వర్లు, కొత్తపేట నాగేశ్వరరావు, సంజామల చిన్నయ్య, వెంకటాపురం నాగ శేషు, పాతపాడు మహేష్, పాతపాడు శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


కుమ్మరి శాలివాహన సంక్షేమ సంఘం క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

వైసిపి మండల కన్వీనర్‌గా పోదొడ్డి కృష్ణమూర్తి



ప్రజాశక్తి - ప్యాపిలి : వైసిపి మండల కన్వీనర్‌గా పోదొడ్డి కృష్ణమూర్తిని నియమితులయ్యారు. ఆదివారం పోదొడ్డి కృష్ణమూర్తి మాట్లా డుతూ తనపై నమ్మకం ఉంచి మండల కన్వీనర్‌గా ఎన్నిక చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి, ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో వైసిపి బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

అచ్చంపేట ఎమ్మెల్యే దంపతులకు విద్యుత్ కార్మికులు సన్మానం

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్ట్

శ్రీశైలం ప్రాజెక్టు కాలనీలోని స్థానిక అతిథి గృహంలో తెలంగాణ రాష్ట్రం అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ దంపతులను తెలంగాణ రాష్ట్రం ఎఐటియుసి అనుబంధమైన హెచ్-64 ఎంప్లాయిస్ యూనియన్ సెక్రెటరీ బి.లక్ష్మయ్య, ఎడమ గట్టు భూగర్భ జల విద్యుత్ కార్మికులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే గెలిచినందుకు, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా బి.లక్ష్మయ్య మాట్లాడుతూ టిఎస్ జెన్కోలో కార్మికులుగా పని చేస్తున్న తమ సమస్యలను పరిష్కరించాలని, పర్మినెంట్ అయ్యేలా చూడాలని కోరారు. ఎమ్మెల్యే స్పందిస్తూ ఆరు నెలల్లోపు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి పర్మినెంట్ అయ్యేలా కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో ఎం.రామయ్య, సిహెచ్ శీను, ఎస్.కె మస్తాన్, బి.శంకర్, కె.విశ్వకుమార్, అబ్దుల్ ఖాదర్, పి.మల్లికార్జున, మక్బూల్, జి.రాజు, సోమిరెడ్డి, గౌరీ, ఎస్‌కె.అబ్దుల్, డి.గౌరీ, జె.చంద్రకళ, ఎస్.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేకు అభినందనలు తెలుపుతున్న విద్యుత్ కార్మికులు


పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి

అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - మహానంది

మహానంది క్షేత్రంలో శ్రీశైలం ఎమ్మెల్యే తన సొంత నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి శనివారం పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని, నాణ్యతతో చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి, చైర్మన్ కొమ్మా మహేశ్వర్ రెడ్డి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

అంతరర్జాతీయ యోగా పోటీల్లో రాణించిన విద్యార్థి జోగి మహేంద్ర యాదవ్

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

అంతరర్జాతీయ యోగ ఛాంపియన్ షిప్ పోటీల్లో కొలిమిగుండ్ల మండలం మదనంతపురం గ్రామానికి చెందిన చెక్క మల్లేష్ యాదవ్, చెక్క దేవి దంపతుల కుమారుడు చెక్క జోగి మహేంద్ర యాదవ్ రాణించాడు. జోగి మహేంద్ర యాదవ్ అనంతపురం జిల్లా లేపాక్షిలోని ఎపిఆర్ఎస్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. జోగి మహేంద్ర యాదవ్‌కు తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు కలగాలి : మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నందికొట్కూరు

నియోజకవర్గ ప్రజలకు మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి నూతన సంవత్సర శుభాకాంక్షలు ఆదివారం తెలిపారు. 2024 ప్రజల ఆనందాల సంవత్సరం కావాలని, ప్రతి ఇంటా నూతన సంవత్సరంలో సుఖ సంతోషాలు వెల్లివిరియాలని, సంపద, సమద్ధి కలుగాలని ఆకాంక్షించారు. **సంజామల :** మండలంలోని ఎమ్మార్పీఎస్ నాయకులకు, కార్యకర్తలకు 2024 నూతన సంవత్సర శుభాకాంక్షలు మండల అధ్యక్షులు లక్ష్మయ్య మాదిగ, యువసేన ఎమ్మార్పీఎస్ నాయకులు శేఖర్ మాదిగ తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - రుద్రవరం

రుద్రవరంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నంద్యాల ఉదయానంద ప్రైవేట్ ఆస్పత్రి ఆధ్వర్యంలో వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. సీనియర్ గుండె వైద్య నిపుణులు డాక్టర్ రామేశ్వర్ రెడ్డి (ఎంబిబిఎస్) గుండె జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 45 మందికి ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్యం అందించేందుకు నంద్యాల ఉదయానంద ప్రైవేట్ ఆసుపత్రికి రెఫర్ చేశారు. ఉదయానంద ప్రైవేట్ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

నియోజకవర్గ ప్రజలకు ఎక్కల దేవి చంద్రమౌళి నూతన సంవత్సర శుభాకాంక్షలు

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్ : శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి, నియోజకవర్గ ప్రజలకు, వైసిపి ప్రజా ప్రతినిధులకు, కార్యకర్తలకు ఆ పార్టీ నందికొట్కూరు నియోజకవర్గ యువ నాయకులు ఎక్కలదేవి చంద్రమౌళి నూతన సంవత్సర శుభాకాంక్షలు ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పదవి చేపట్టిన రోజు నుండి నవరత్నాల్లో భాగంగా ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నారని తెలిపారు. నందికొట్కూరు నియోజకవర్గ అభివృద్ధికి బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి చొరవతో అనేక పనులకు నిధులు మంజూరు చేయించినట్లు చెప్పారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో వైసిపిని మళ్లీ ఆదరించాలని కోరారు.


శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎక్కల దేవి చంద్రమౌళి


జాతీయ ఆచార్య పురస్కారం అందుకుంటున్న దేశెట్టి శ్రీనివాసులు

దేశెట్టి శ్రీనివాసులకు జాతీయ ఆచార్య పురస్కారం

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

అమీర్ ఆర్ట్స్ అకాడమీ 8వ వార్షికోత్సవం సందర్భంగా ఆల్ ఇండియా చిల్డ్రన్స్ ఆర్ట్స్ కాంపిటీషన్ బహుమతుల ప్రధానోత్సవం నెల్లూరు టౌన్ హాల్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నందికొట్కూరు పట్టణానికి చెందిన చిత్రకారుడు, శీను ఆర్ట్స్ అకాడమీ డైరెక్టర్ దేశెట్టి శ్రీనివాసులకు జాతీయ ఆచార్య పురస్కారం, మెమొంటోను అందించి ముఖ్య అతిథులు ఘనంగా సన్మానించారు. అమీర్ ఆర్ట్స్ అకాడమీ జాతీయ స్థాయి చిల్డ్రన్స్ చిత్రలేఖనం పోటీలలో నవనంది, సెంట్ మేరీస్, స్కాలర్ హైస్కూల్ 11 మంది చిన్నారులకు బంగారు పథకాలు ఆర్ట్ శ్రీనుకు అందజేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులు అమరావతి కృష్ణారెడ్డి, కృష్ణపట్నం ఆయుర్వేద డాక్టర్ అనంతయ్య, జబర్దస్త్ కళాకారుడు హరిబాబు, ప్రముఖ చిత్రకారుడు గిన్నిస్ బుక్ రికార్డు హోల్డర్ డాక్టర్ అమిర్జాన్ తదితరులు పాల్గొన్నారు.

వైసిపి ఆగడాలను అరికట్టాలి : భూమా కిషోర్ రెడ్డి

ప్రజాశక్తి - చాగలమర్రి : వైఎస్ఆర్సిపి ప్రభుత్వం ఆగడాలను అరికట్టేందుకు అన్ని పార్టీలు ఏకమై గద్దె దించాలని బిజెపి నియోజకవర్గ ఇన్చార్జి భూమా కిషోర్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని పెద్ద బోధన గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. త్వరలో రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఆళ్లగడ్డ నియోజకవర్గంలో బిజెపి జెండాను ఎగరవేద్దామన్నారు. రానున్న ఎన్నికల్లో టిడిపి జనసేనతో పొత్తు ఆళ్లగడ్డ శాసనసభ స్థానానికి పోటీ చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో బిజెపితో పొత్తు కుదుర్చుకునేందుకు జనసేన, టిడిపి సిద్ధమయ్యాయని ఇందులో భాగంగానే ఆళ్లగడ్డ స్థానాన్ని బిజెపికి కేటాయిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో బిజెపి జెండాను ఎగరవేయడం తథ్యమన్నారు. చంద్రబాబు కూడా అధికారంలోకి వచ్చేందుకు ఎన్ని త్యాగాలకైనా సిద్ధం కావాలని ఆ నాయకులను కోరారు. అనంతరం పెద్ద భోదనం గ్రామంలో నిర్మాణంలో ఉన్న సిఎస్ఐ చర్చిని ఆయన పరిశీలించారు. చర్చి నిర్మాణంకు తన వంతు సహకారం రూ.50 వేలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సింగం భరత్ కుమార్ రెడ్డి, రామనాథరెడ్డి, హరిచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు

టిడిపితోనే రాష్ట్ర భవిష్యత్తుకు గ్యారెంటీ

ప్రజాశక్తి - పాములపాడు

టిడిపితోనే రాష్ట్ర భవిష్యత్తుకు గ్యారెంటీ అని రాష్ట్ర ఎస్సి సెల్ ఆర్గనైసింగ్ సెక్రెటరీ జయసూర్య అన్నారు. ఆదివారం మండలంలోని బానకచర్ల, గుండాలనట్టు గ్రామాలలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి తిరిగి టిడిపి మినీ మేనిఫెస్టో బ్రోచర్లను ప్రజలకు అందజేశారు. కార్యక్రమంలో తిమ్మారెడ్డి, వెంకటేశ్వరావు, గోవిందు, మధుకృష్ణ, గట్టు లింగేశ్వర్ గౌడ్, శివశంకరస్వామి, పూసల కృష్ణ, రాము నాయక్, హరికృష్ణ నాయక్, సోమని నాయక్, స్వాములు, గజ్జెల భాస్కర్ రెడ్డి, ఆదిరెడ్డి, లక్ష్మీకాంత రెడ్డి, పరమేష్, సుంకన్న పాల్గొన్నారు.


బ్రోచర్లను పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

ప్రతి ఇంటికీ శుద్ధ జలాలు : చైర్మన్

ప్రజాశక్తి - బేతంచెర్ల

గోరుకల్లు రిజర్వాయర్ నుండి నీటిని సప్లై చేసి బుగ్గానిపల్లి తండా సమీపంలో పది ఎకరాలలో నిర్మించిన శుద్ధ జల ప్లాంట్ ద్వారా నీటిని బేతంచర్లలోని ప్రతి ఇంటికి సరఫరా చేస్తామని బేతంచెర్ల నగర పంచాయతీ చైర్మన్ సిహెచ్ చలం రెడ్డి అన్నారు. ఆదివారం బేతంచర్ల పట్టణంలోని నీళ్ల ట్యాంకులను కమిషనర్ రమేష్ బాబు ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బందితో శుభ్రం చేయిస్తూ, రంగులు వేయించి ముస్తాబు చేయించారు. సాధ్యమైనంత త్వరలో శుద్ధ జల నీటిని ప్రజలకు నూతన సంవత్సరం కానుకగా సరఫరా చేస్తామని తెలిపారు.

బాధితుడికి ఆర్థికసాయం

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

కొలిమిగుండ్లలోని పోతిరెడ్డి రామసుబ్బారెడ్డి కార్యాలయంలో పోతురెడ్డి రామసుబ్బారెడ్డి సేవా సమితి అధ్యక్షులు వెంకటసుబ్బారెడ్డి బంధార్లపల్లి గ్రామానికి చెందిన వడ్డే పెద్దరాజుకు రూ. 15 వేలు ఆర్థిక సహాయాన్ని ఆదివారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ గత నెలలో రోడ్డు ప్రమాదంలో పెద్దరాజు కాలికి తీవ్ర గాయాలై కాలు తీసేశారని, కుటుంబానికి తమవంతు ఆర్థికసాయం అందజేశామన్నారు. కార్యక్రమంలో సాయిబాబా, ఎర్ర కంబయ్య తదితరులు పాల్గొన్నారు

చౌడేశ్వరి దేవస్థానానికి రూ. 50 వేలు విరాళం

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని నందవరం చౌడేశ్వరి దేవస్థానం అభివృద్ధికి భక్తులు రూ. 50 వేలు విరాళం అందజేసినట్లు ఆలయ ఈవో రామానుజన్ తెలిపారు. ఆదివారం చౌడేశ్వరి దేవస్థానానికి హైదరాబాద్‌కు చెందిన దాట్ల హరి ప్రసాద్ రెడ్డి, అతని భార్య లక్ష్మీ కల్పన, కుటుంబ సభ్యులు కలిసి విరాళం నగదును ఆలయ ఈవోకు అందజేశారు.

ఆటపాటలతో నిరసన

5వ పేజీ తరువాయి.. పూనుకుంటున్నారని, అలాంటి బెదిరింపులకు భయపడేది లేదని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.రాజశేఖర్ పేర్కొన్నారు. ఆదివారం పాములపాడులో అంగన్వాడీలు కబడ్డీ, ఖోఖో ఆటలు ఆడి నిరసన తెలిపారు. ఈ సమ్మెకు ఎ.రాజశేఖర్ మద్దతు తెలిపి మాట్లాడారు. రైతు సంఘం జిల్లా నాయకులు ఈరన్న, నాయకులు సామన్న, వెంకటేశ్వరరావు, రంగస్వామి, అంగన్వాడీ నాయకురాలు శివలక్ష్మి, నాగమద్దమ్మ, నాగమణి, రమణ బాయ్, శ్రీలత, టీచర్లు పాల్గొన్నారు. **ఆత్మకూరు :** పట్టణంలోని తహసిల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు అట పాటల ద్వారా నిరసన తెలియజేశారు. అనంతరం బసవన్నకు వినతిపత్రం అందజేశారు. అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి మంజుల, నాయకురాలు లక్ష్మీదేవి, ప్రమీలమ్మ, సిఐటియు పట్టణ అధ్యక్షులు రజాక్, కార్యదర్శి రామ్ నాయక్, ఉపాధ్యక్షులు రణధీర్, అంగన్వాడి నాయకురాలు సుధారాణి, వెంకటలక్ష్మి, లక్ష్మి, ప్రియాంక, ప్రమీల, రవణమ్మ, అరుణ, విజయలక్ష్మి, లక్ష్మీదేవి, చెన్నమ్మ, సుజాత, సిఐటియు నాయకులు సురేంద్ర, గణపతి పాల్గొన్నారు. **కొత్తపల్లి :** తహశీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు అట పాటల ద్వారా నిరసన తెలియజేశారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు ఇ.హరిత, మండల నాయకురాలు రమణమ్మ, శ్రీదేవి, లైసమ్మ, శ్రావణి, మరియమ్మ, నాగమణి, అంకమ్మ, సుభాషిని, వసంత లక్ష్మి, లలితమ్మ తదితరులు పాల్గొన్నారు. **మిడుతూరు :** మిడ్తూర్‌లో నిరవధిక సమ్మె దీక్షా శిబిరం వద్ద అంగన్‌వాడీలు కబడ్డీ, ఆటపాటలు ఆడి నిరసన వ్యక్తం చేశారు. అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శు డి.సుబ్బమ్మ, జి.లక్ష్మి కుమారి, వ్యకాస జిల్లా సహాయ కార్యదర్శి పక్కిరి సాహెబ్, జిల్లా నాయకులు టి.ఓబులేసు, సిఐటియు జిల్లా నాయకురాలు జి.నాగమణి, మండల నాయకులు వెంకటశివుడు, అంగన్వాడీ నాయకులు జయమ్మ, రాధిక, రమాదేవి, నారాయణమ్మ, భువనేశ్వరి, ఉమాదేవి, శైలజ, సైదాబీ, హరిప్రియ, లక్ష్మీదేవి పాల్గొన్నారు. **పగిద్యాల :** పగిద్యాలలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు నిరవధిక సమ్మెను కొనసాగించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, అంగన్వాడి కార్యకర్తలు వరలక్ష్మి, పద్మావతమ్మ, ప్రభావతి, నాగమణి, పద్మావతి, హైమావతి తదితరులు పాల్గొన్నారు. **నందికొట్కూరు టౌన్ :** పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు ఆటపాటలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు భాస్కర్ రెడ్డి, వ్యకాసం జిల్లా అధ్యక్షులు ఎం.నాగేశ్వరరావు, అంగన్వాడి నాయకురాలు మదార్ బి, శైలజ, వెంకట లక్ష్మమ్మ, లలిత, లక్ష్మీ, నాగరత్నమ్మ, అరుణ కుమారి, అక్కమ్మ, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు. **బండి ఆత్మకూర్ :** మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్స్ సిఐటియు మండల కార్యదర్శి రత్నమయ్య, వ్యకాసం నాయకులు దేవిడ్‌ల ఆధ్వర్యంలో ఆటపాటలతో నిరసన తెలిపారు. అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు. **కొలిమిగుండ్ల :** ఆడుదాం-ఆంధ్ర క్రీడల్లో నిమగ్నమైన ప్రభుత్వానికి అంగన్వాడీలు కబడ్డీ ఆడుతూ తమ డిమాండ్లను కూత ద్వారా వినిపించి విన్నూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. కొలిమిగుండ్ల ఎమ్మార్వో కార్యాలయం వద్ద అంగన్వాడీలు చేపట్టిన సమ్మె 20వ రోజుకు చేరుకుంది. అంగన్వాడీ యూనియన్ నాయకులు, సిఐటియు జిల్లా నాయకుడు పి దావీదు, అంగన్వాడి వర్కర్స్ భాగ్యలక్ష్మి, శ్రీదేవి, రేణుక, సరిత, శ్రీలక్ష్మి, లక్ష్మి, సుజని, సుహాసిని, జ్యోతి, రామలక్ష్మి, రంగమ్మ పాల్గొన్నారు. **బనగానపల్లె :** పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో అంగన్వాడి వర్కర్లు, హెల్పర్లు కుర్చీలాట ఆడి నిరసనను వ్యక్తం చేశారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఎల్లయ్య, డివిజన్ కార్యదర్శి సుబ్బయ్య, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి రోజారమణి, అంగన్వాడి వర్కర్లు రమాదేవి, వరలక్ష్మి, మల్లేశ్వరి, మహేశ్వరి, శశికళ, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు. **బేతంచెర్ల :** అంగన్వాడీలు స్థానిక సిఐటియు కార్యాలయం ఆవరణలో మ్యూజికల్ చైర్ ఆట ఆడుతూ, పాటలు పాడుతూ అంగన్‌వాడీ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఎస్‌కె.నాగలక్ష్మి, గుల్జార్బి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. జిల్లా అధ్యక్షురాలు జి.షేభారాణి మాట్లాడారు. అంగన్వాడీలు అంజలి, సరోజ, ఎల్లమ్మ, రమణమ్మ, అనూష, జ్యోతి, భూలక్ష్మి, సరళ, మహాలక్ష్మి సరస్వతి, రాధాదేవి, రమాదేవి నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు. **మహానంది :** శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డికి అంగన్వాడీలు డిమాండ్స్‌తో కూడిన వినతి పత్రం మహానంది క్షేత్రంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంగన్వాడిల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. **డోన్ :** సిఐటియు ఆధ్వర్యంలో జరుగుతున్న అంగన్వాడీల నిరవధిక సమ్మెలో భాగంగా దీక్షా శిబిరం దగ్గర అంగన్వాడీలు క్రికెట్ ఆడి నిరసన వ్యక్తం చేశారు. ఈ నెల 3న నిర్వహించే నంద్యాల కలెక్టరేట్ ముట్టడికి అంగన్‌వాడీలు తరలిరావాలని సిఐటియు నాయకులు పిలుపు నిచ్చారు. అనంతరం జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మాణిక్యం శెట్టి, సిఐటియు జిల్లా కార్యదర్శి టి.శివరాం, మండల అధ్యక్షులు పి.రామాంజనేయులు, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు సులోచన, రహమద్బి, సుమలత మాట్లాడారు. **చాగలమర్రి :** రాష్ట్రంలో చేతకాని దద్దమ్మ ప్రభుత్వం అమలవుతుందని, దీన్ని ప్రజలు త్వరలోనే ఇంటికి సాగనంపుతారని జనసేన ఆళ్లగడ్డ ఇన్చార్జి ఇరిగెల రాంపుల్లారెడ్డి విమర్శించారు. చాగలమర్రిలోని అడ్డవాగు వద్ద గత 20 రోజులుగా సిఐటియు నాయకులు పద్మావతి, నాగమణి, సంజమ్మ, వై పద్మావతి, నాయకురాలు చంద్రకళ, వహీదా, ఇందుమతిల ఆధ్వర్యంలో అంగన్వాడీలు చేస్తున్న నిరవధిక నిరసన దీక్షలకు జనసేన పార్టీ తరపున కార్యకర్తలతో కలిసి ఆదివారం సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు, జనసేన నాయకులు సుధాకర్ రెడ్డి, విశ్వనాథ్ రెడ్డి, నారాయణరెడ్డి, జున్ను ప్రసాద్ రెడ్డి, సుబ్బయ్య, ఉప్పు మా భాష, జయసూర్య, రామకృష్ణ, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు. **రుద్రవరం :** రుద్రవరం తాసిల్దార్ కార్యాలయం ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీ టీచర్లు, ఆయాలు 20వ సంఖ్య ఆకారంలో కూర్చుని నిరసన తెలిపారు. అనంతరం కోలాటం ప్రదర్శిస్తూ, కబడ్డీ ఆడుతూ, పాటలు పాడుతూ నిరసనలు తెలిపారు. రైతు సంఘం జిల్లా సహకార దర్శి రామచంద్రుడు, అంగన్వాడి యూనియన్ నాయకురాళ్లు పద్మ, రాజ్యలక్ష్మి, రాఘవేంద్ర, భూలక్ష్మి, షాహిన్, ఝాన్సీ, లలితమ్మ తదితరులు పాల్గొన్నారు.


బేతంచెర్లలో ఆటపాటలతో నిరసన


బనగానపల్లెలో కుర్చీలాటతో నిరసన


పాములపాడు : మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రాజశేఖర్


ఆత్మకూరులో ఆవుకు వినతి ఇస్తూ నిరసన..


మహానందిలో ఎమ్మెల్యేకు వినతి ఇస్తున్న అంగన్వాడీలు

నందికొట్కూరులో...

